# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,గురువారం,
జూన్ 11, 2026
పేజీలు : 8+4
సంపుటి: 29,సంచిక:02

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

గురువారం, తేది:11-06-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,అధిక జ్యేష్ఠ మాసం,ఉత్తరాయణం-గ్రీష్మరుతువు,బహుళ పక్షం,ఏకాదశి,అశ్విని,వర్జ్యం,రా. 11.17 ల 12.49




## ఒక్క వర్షానికే మునిగిన మహానగరం..

## మున్ముందు చుక్కలేనా?

హైదరాబాద్ (మెట్రోన్యూస్): నిన్న గంటపాటు కురిసిన భారీ వర్షానికి హైదరాబాదీలు చుక్కలు చూశారు. గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీ లాంటి ఐటీ కారిడార్తో పాటు ఇతర ప్రాంతాల్లోనూ రోడ్లు నదులను తలపించాయి. లక్షలాది వాహనాలు ట్రాఫిక్లో చిక్కుకుపోయాయి. మొదటి వర్షానికే ఇలా అయితే ఈ వానాకాలంలో పరిస్థితి ఏంటని నగరవాసులు టెన్షన్ పడుతున్నారు.



# ప్రపంచానికే ఫ్యూచర్ సిటీ

### రేపటి భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నాం
### రద్దు చేస్తామన్న వాళ్లకు ప్రతిపక్షం హోదా కూడా దక్కదు
### ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యాలయం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (మెట్రో న్యూస్): రేపటి భవిష్యత్తుకు ఈనాడే పునాదులు వేసి ప్రపంచానికి అద్భుతమైన నగరాన్ని అందించబోతున్నాం అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశానికి కాదు యావత్ ప్రపంచానికే ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని పెద్ద రాక్షసుడు, చిన్న రాక్షసులు అంటున్నారు.

ప్రపంచానికి ఒక దిక్సూచిగా ఫ్యూచర్ సిటీని గొప్ప నగరంగా తీర్చిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. కళ్లలో నిప్పులు పోసుకుని, కడుపులో విషం నింపుకొని అమెరికాలో కూడా ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారు.వాళ్లని తెలంగాణ ప్రజలు తిరస్కరించారు. వాళ్లకు గతమే తప్ప భవిష్యత్తు లేదు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే వచ్చే సారి ప్రతి పక్ష హోదా కూడా రాదు. ఈ ప్రాంత ప్రజలు బండకేసి కొడతారని సీఎం తేల్చిచెప్పారు.

## కాంగ్రెస్లో టీఎంసీ విలీనం?

ఢిల్లీ (మెట్రోన్యూస్): జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటు న్నాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్పర్సన్ సోనియా గాంధీతో భేటీ అయిన మరుసటి రోజే, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. బుధవారం ఢిల్లీలోని 10 జన్ పథ్లో దాదాపు 90 నిమిషాల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీ, కాంగ్రెస్లో తృణమూల్ విలీనం కానుందనే ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది.ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీజేపీ 208 స్థానాలతో అధికారాన్ని దక్కించుకోగా, టీఎంసీ కేవలం 80 సీట్లకే పరిమితమైంది. ఈ ఓటమి అనంతరం పార్టీలో తీవ్ర అసమ్మతి చోటుచేసుకుంది.



# వచ్చే వేసవికి మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ

### ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మహదేవ్పూర్ (మెట్రో న్యూస్): మేడిగడ్డ బ్యారేజ్తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నినిజూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు.

## దేశాన్ని మోసం చేసిన ప్రధానిగా మోదీ రికార్డు



హైదరాబాద్ (మెట్రోన్యూస్): దేశాన్ని మోసం చేసిన ప్రధానమంత్రిగా, మోదీ రికార్డు పాలన సాగించారని రాష్ట్ర సమా చార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. రికార్డు స్థాయి అప్పులు. రికార్డు స్థాయి అవినీతి. రికార్డు స్థాయి ఇంధన ధరలు. రికార్డు స్థాయి నిరు ద్యోగం. రికార్డు స్థాయి ప్రశ్నాపత్రాల లీకులు.రికార్డు స్థాయిలో రూపాయి విలువ పతనం జరిగిందని అభినందనలు తెలిపారు. కొంతమందిని ఎల్లప్పుడూ, అందరినీ కొంతకాలం మోసం చేయవచ్చు అని తరచూ చెబుతుంటారు. కానీ గత 12 సంవత్సరాలుగా యావత్ దేశాన్నే మోసం చేయడంలో మోదీ విజయం సాధించారని మంత్రి పొంగు లేటి ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి మోదీ ప్రభుత్వం రాష్ట్ర ఆకాంక్షలను, అభివృద్ధిని నిరంతరం నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన ఒక్క ప్రధాన హామీ కూడా పూర్తిగా అమలు కాలేదు.

## గంజాయి, డ్రగ్స్పై ప్రజలు యుద్ధం చేయాలి:డీజిపి

హైదరాబాద్ (మెట్రోన్యూస్): పోలీసు స్టేషన్కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. ఈరోజు (బుధవారం) ఆదిలాబాద్ జిల్లాలో డీజీపీ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోషం గ్రామసభలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు.

# ప్రధాని పదవిలో చరిత్ర సృష్టించిన మోదీ

## మంత్రివర్గం స్టాండింగ్ ఒవేషన్, తీర్మానం



ఢిల్లీ (మెట్రోన్యూస్):భారత ప్రధానిగా సుదీర్ఘకాలం పాటు పదవిలో కొనసాగుతూ చరిత్ర సృష్టించినందుకు నరేంద్ర మోదీని అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. బుధవారంనాడిక్కడ జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ప్రధానమంత్రిని అభినందిస్తూ మంత్రులంతా లేచి నిలబడి చప్పట్లతో cస్టాండింగ్ ఒవేషన్c ఇచ్చారు. ప్రధానమంత్రి 4,399 రోజుల సుదీర్ఘ పాలన అభినందనీయమని కొనియాడారు. తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత అప్పటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 4,398 రోజులు పదవిలో కొనసాగారు. ఆ రికార్డును ప్రధానమంత్రి మోదీ నేటితో అధిగమించారు. ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అదిపెద్ద పరీక్ష అని ప్రధానమంత్రి మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసినప్పుడే ఎవరైనా ప్రజా విశ్వాసాన్ని చూరగొంటారని పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ, విదేశీ ప్రముఖులు పలువురు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.



## ఎన్డీయే వచ్చాక ప్రజల్లో నమ్మకం పెరిగింది

### కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయి

ఢిల్లీ (మెట్రోన్యూస్): గత 12 ఏళ్ల నుంచి దేశానికి పట్టిన కాంగ్రెస్ పీడ విరగడైందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను తాము సరిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. ఈరోజు (బుధవారం) ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు.



## తల్లిదండ్రుల గుండెల్లో గుబులు

హైదరాబాద్ (మెట్రోన్యూస్): వేసవి సెలవుల్లో పిల్లలతో సరదాగా గడిపిన తల్లిదండ్రులకు ఇప్పుడు ఫోన్ మోగితే గుబులు పడుతోంది. మరో 5రోజుల్లో స్కూల్స్ ఓపెన్ కానున్నాయని స్కూల్స్ యజమాన్యాలు రూ. వేలల్లో ఖర్చులు చెబుతుండటంతో నాన్న కు కంగారు మొదలైంది. నగరంలో పెరిగిన స్కూల్ ఫీజు, యూనిఫామ్స్, బుక్స్, బ్యాగులు, బస్సు ఛార్జీలు, నిత్యావసరాలు, రూమ్ రెంట్లను లెక్కలేయడం మొదలుపెట్టారు. పిల్లల చదువు కోసమే నగరానికి వచ్చిన ఓ తండ్రి మాటలివి.




ఫైల్

## ఖర్గే సారధ్యంలో నేడు ఏఐసీసీ అత్యవసర భేటీ

ఢిల్లీ (మెట్రోన్యూస్): ఢిల్లీ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బలు, తృణమూల్ కాంగ్రెస్లో చెలరేగిన అంతర్గత తిరుగుబాటు కలకలం రేపుతున్నాయి. మరోవైపు ఆపరేషన్ లోటస్ భయాల మధ్య కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. దేశంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చింది.అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్ఛార్జులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులందరూ గురువారం ఢిల్లీలోని ఇందిరా భవన్లో జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. వారందరినీ ఆహ్వానిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ లేఖలు రాశారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగనుంది.జూన్ 8న జరిగిన ఇండియా కూటమి సమావేశంలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఆ పరిణామాలు జరిగిన కొన్నిరోజులకే కాంగ్రెస్ ఈ అంతర్గత భేటీని నిర్వహించనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్సభలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రతిపలు ఐక్యంగా ఎదుర్కొని వీగిపోయేలా చేశాయి. ఆ విజయాన్ని గత సమావేశంలో ఖర్గే అభినందించారు.

# మహిళల ఎదుగుదల సమాజ ఎదుగుదల: మంత్రి సీతక్క



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** మహిళల ఎదుగుదలే సమాజ ఎదుగుదల అని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలు బొజ్జ సంధ్యారెడ్డి నిర్వహిస్తున్న మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 3,000 మంది మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ సర్టిఫికెట్ల అందజేత కార్యక్రమం బుధవారం గాంధీ భవన్లో జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా ప్రగతే తెలంగాణ ఉన్నతి అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. 15 ఏళ్ల నుంచి 60 ఏళ్లు దాటిన వారు కూడా మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరవచ్చని ఆమె పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన వారికి కుట్టు మిషన్లు అందిస్తామని షాప్ ఏర్పాటు చేసుకోవాలంటే రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు రుణం అందిస్తామని మరిన్ని మిషన్లు కొనుగోలు చేసి వ్యాపారాన్ని విస్తరించుకోవాలనుకుంటే అదనపు రుణాలతో పాటు శిక్షణ కూడా అందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. మదర్ ఫౌండేషన్ గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆమె ప్రశంసించారు. గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల్లో చేరాలని ఆమె కోరారు. 553 బస్సులను మహిళా సంఘాలకు అందజేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. వాటి ద్వారా వారు నెలకు సగటున రూ. 70 వేల వరకు ఆదాయం పొందుతున్నారని ఆమె స్పష్టం చేశారు. పంటల సీజన్‌లో మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కార్యక్రమాలు చేపడుతున్నామని గత సంవత్సరం మహిళా సంఘాలు రూ. 159 కోట్ల ఆదాయం ఆర్జించాయని ఆమె వివరించారు. కుట్టు మిషన్లను ఎలా అందించాలనే అంశంపై ముఖ్యమంత్రి చర్చించామని తెలిపారు గుర్రాన్ని నీళ్ల దగ్గరకు తీసుకెళ్లగలం, కానీ నీళ్లు తాగించలేమని అవకాశాలను మాత్రం కల్పించగలమని చెప్పారు. వ్యాపారం ఏర్పాటు చేసుకుని మహిళలు ఎదగాలన్నారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ. 61 వేల కోట్ల రుణాలు అందించామని వాటి వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. షాపులు ఏర్పాటు చేసుకోవడానికి మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రుణాలు అందిస్తున్నామని ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రమాద బీమా, రుణ బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని ఇప్పటి వరకు 6 లక్షల మంది మహిళలు రుణాలు పొందారన్నారు. మహిళలు ఈవెంట్ మేనేజ్‌మెంట్, జ్యువెలరీ, కుట్టు తదితర రంగాల్లో రాణిస్తున్నారని అదే విధంగా స్వయం ఉపాధి కేంద్రాలు, షాపులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించామని కుట్టు పని తెలిసినవారు ఎవరూ అవకాశాలు కోల్పోకుండా అందరికీ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని 60 ఏళ్లు దాటిన వారికి కూడా విద్య అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. స్నేహ గ్రూపులలో ఇప్పటికే లక్ష మంది మహిళలను చేర్చి సైకిల్ తొక్కడం నేర్పించామని భవిష్యత్తులో వారికి ఎలక్ట్రిక్ బైక్‌లు కూడా అందించబోతున్నామని సీతక్క తెలిపారు.. శిల్పారామం వద్ద 106 షాపులు మహిళల ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. మహిళలకు ఏదైనా మేలు చేస్తే కొందరు విమర్శిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినా విమర్శిస్తున్నారని తెలిపారు. మహిళలను కించపరిస్తే సహించమని తగిన సమాధానం చెబుతామన్నారు. భూదేవికి ఉన్న ఓర్పు, రాకెట్‌కు ఉన్న వేగం మహిళలకు ఉన్నాయని మహిళలపై ఎవరైనా అనుచితంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో నివేదిక ఇవ్వండని అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని సీతక్క హామీ ఇచ్చారు.

## భారతిరాజా మృతి పట్ల టీ టీడీపీ సంతాపం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** ప్రఖ్యాత దర్శకులు భారతి రాజా మృతి పట్ల తెలంగాణ తెలుగుదేశం పార్టీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది ఈ మేరకు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్ లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన తమిళ దర్శకుడై నప్పటికీ తెలుగులో సీతాకోక చిలుక వంటి చిరస్మరణీయ చిత్రాలనూ నిర్మించారని వారు తెలిపారు ఆయన మరణం భారతీయ సినీ రంగానికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని వారు ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వారు తెలిపారు.

## మేడిగడ్డ ప్రాజెక్టును మళ్లీ జలకల తెస్తాం

- ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**మెట్రో న్యూస్ కాటారం:** మహాదేవపూర్ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రాముఖ్యత గల ప్రార్థిస్తూ మళ్లీ జలకల తీసుకొస్తామని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి అన్నారు. లక్ష కోట్లతో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టును పునరుద్ధరించాలనె ప్రధాన ఉద్దేశంతో తెలంగాణ ప్రజాపాలన 7:00 మే డిగడ్డ ప్రాజెక్టును ప్రభుత్వం నీటిపారుదల శాఖ మంత్రి. ఉత్తమ కుమార్ రెడ్డి ఈరోజు ప్రాజెక్టు సందర్శనతో పాటు నీటిపారుదల ఆయకట్ల అభివృద్ధి పరీక్షల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు . వారికి కాంగ్రెస్ నాయకులు గ్రంథాలయ చైర్మన్ కోట రాజ బాపు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఆంగోతు సుగుణ, ఏఎంసీ చైర్పర్సన్ పంతకాని తిరుమల డిసిసి అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, ఏఎంసి డైరెక్టర్ తిరుపతిరావు నాయకులు కుమార్ కొమురయ్య తదితరులు శాలువాతో పూల మొక్కలతో మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి స్వాగతం పలికారు

## బీజేపీ ఓట్ చోరీ, సీట్ చోరీ

- ప్రభుత్వ విప్ వేముల వీరేశం



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** బీజేపీ ఓట్ చోరీ తో పాటు సీట్ చోరీ చేసిందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. బుధవారం సీఎల్పిలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఓటు చోరి ద్వారా ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని తమ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ అనేక సార్లు చెప్పారన్నారు బీజేపీ ఓటు చోరి తో పాటు సీటు చోరి కూడా చేస్తోందని ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణతో తేట తెల్లం అయిందని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ గాంధేయ వాది, నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి మీనాక్షి నటరాజన్‌అని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తు మీనాక్షి నటరాజన్ నామినేషన్ ను తిరస్కరించేలా బీజేపీ పెద్దలు చేశారని ఆయన విమర్శించారు. నెహ్రూ రికార్డు ను బ్రేక్ చేశానని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ ఈ దేశ విలువలను, ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేయడంలో రికార్డు కూడా సృష్టించారని తెలిపారు. కోర్టులో పిటిషన్ వేశారని దాని ఆధారంగా ఎఫ్ ఐఆర్ లేకుండా నామినేషన్ ను తిరస్కరించడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజని రాజ్యాంగాన్ని చేతుల్లో పట్టుకుని రాహుల్ గాంధీ పార్లమెంటులో ప్రమాణం చేశారని బీజేపీతో ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం ఉందని ముందే రాహుల్ గాంధీ హెచ్చరించారని ఆయన గుర్తు చేశారు.

## రేవంత్ పాలనలో నిత్యం ఆడబిడ్డలపై అఘాయిత్యాలే

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** రేవంత్ రెడ్డి పాలనలో మహిళలపై నిత్యం అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగి స్తున్నాయన్నారు. ఖమ్మం నగరంలో 12 ఏళ్ల బాలికపై అఘా యిత్యానికి ఒడిగట్టి ఆ బాలికను నాలుగో అంతస్తు నుంచి తోసేసి హత్య చేయాలని ప్రయత్నించిన ఘటన దారుణమని కవిత అన్నారు. ఈ ఘటనలో నిందితుడికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటు మల్కాజ్‌గిరిలో ఓ వ్యక్తి తన భార్యను తుపాకీతో కాల్చి చంపిన ఘటన దారుణమన్నారు. మూడు నెలల క్రితమే నిందితుడు తన భార్యను కాల్చిచంపుతానంటూ బహిరంగంగా బెదిరించాడని కవిత గుర్తు చేశారు. అప్పుడే పోలీసులు స్పందించి చర్యలు తీసుకునే ఉంటే ఓ మహిళ నిండు ప్రాణం బలయ్యేదని కాదన్నారు. మహిళల నేరాలను అరికట్టటంలో సీఎం రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని కవిత విమర్శించారు. పాలనపై ఆయన పట్టు కోల్పోయారన్నారు. ఇకనైనా మేల్కొని మహిళల రక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు.

# మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందిస్తాం



**మెట్రో న్యూస్ మహాదేవపూర్:** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన మేడిగడ్డ ప్రాజెక్టును 2027 వరకు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మేడిగడ్డ ప్రాజెక్టు పునరుద్ధరణకై జరుగుతున్న పరీక్షల పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2014 కంటే ముందే కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును 38వేల కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే దాదాపు 11 వేల కోట్ల రూపాయల పనులు పూర్తి కాగా దాదాపు 30 శాతం పని జరిగిందని తెలిపారు. 2014 తరువాత ఏర్పడిన ప్రభుత్వం కావాలనే ప్రాజెక్టు డిజైన్ మార్పు చేసి మేడిగడ్డ ప్రాజెక్ట్ రూపకల్పన చేసినట్లు తెలిపారు. 16.50 లక్షలు ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులు కావాలనే గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చేయడం వల్ల ఇబ్బంది కలిగిందని, తప్పుడు నిర్ణయాలతో ప్రాజెక్టుకు కాలయాపన చేశారని తెలిపారు. దాదాపు 1,45,000 కోట్లతో మేడిగడ్డ బ్యారేజీ పనులు చేపట్టారని బ్యారేజీ లోపభూయిష్టమైన నిర్మాణం వల్ల కుంగుడం జరిగిందని తెలిపారు. ప్రాజెక్టు కుంగడానికి గల కారణాలను లోతుగా విశ్లేషణ చేసేందుకు సీడబ్ల్యూసీ, ఎన్డిఎస్ఏ వంటి ప్రతిష్టాత్మకమైన అనుభవం కలిగిన సంస్థలచే పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. లోప భూయిష్టంగా నిర్మాణం ఉందని అంచనాలు తయారు చేశారని సాంకేతికంగా అత్యంత పకడ్బందీ పరీక్షలు నిర్వహించి ప్రాజెక్టు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎలాంటి రాజకీయ దురుద్దేశ్యం లేదని తెలిపారు. అన్నారం, సుందిదళ్ల బ్యారేజీ మరమ్మతులు పనులు చేపట్టినట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు చేయడానికి డిసైడ్ అండ్ డిజైన్ కన్సల్టెంట్ గా ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఆఫ్రీన్ అనే కంపెనీని సంప్రదించి ఐఐటి బాంబే నిపుణులతో సంయుక్తంగా రీ డిజైన్ చేపట్టేందుకు పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత సైన్యంలో అత్యంత నైపుణ్యం అత్యంత అనుభవం కలిగిన కల్నల్ పరిషిత్ మెహ్రా చైర్మన్ ఆధ్వర్యంలో ముందుకు పోతున్నట్లు తెలిపారు. కమిటీలో చాలామంది దేశ విదేశాల నుంచి నిపుణులు పెట్టి ఈ పరీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. పరీక్షలు ఎక్కడ వరకు వచ్చాయో పురోగతిని తనిఖీ చేసేందుకు నేడు తనిఖీకి వచ్చినట్లు తెలిపారు. పునరుద్ధరణ పనులు ప్రారంభించడానికి ముందే ప్రతి బ్యారేజ్ యొక్క ఫిజికల్ కండిషన్ తనకి చేస్తూ సమస్యలు ఉంటే మరమ్మతులు చేసేందుకు కార్యచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. తనిఖీలు కేంద్రాలకు వెళ్ళిన తర్వాత ఎనర్జి డిస్పెస్మెంట్ కూడా పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, ఇరిగేషన్ సెక్రెటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, సీఈ శ్రీనివాస్ గుప్తా, ఆర్డిఓ రవీందర్, ఇరిగేషన్ ఎస్ఈ దస్తగిరి, ఈఈ రమేష్, కన్సల్టెంట్ ఈఈ యాదగిరి, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ సురేందర్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల పాల్గొన్నారు.

## ఎల్‌బీ స్టేడియంలో ప్రారంభమైన టీజీఐఐసీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

- ముఖ్య అతిథిగా హాజరైన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి




**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా, ప్రారంభమయ్యాయి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ నిరంతరం విధుల్లో బిజీగా ఉండే ఉద్యోగులకు ఈ క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని చెప్పారు. క్రీడల ప్రధాన ఉద్దేశం కేవలం గెలవడం మాత్రమే కాదని, అందరూ కలిసికట్టుగా పాల్గొనడమే అసలైన విజయమని ఆమె పేర్కొన్నారు. క్రీడాకారులందరూ జట్టు స్ఫూర్తితో ఆడాలని సూచించారు. ఈ క్రీడా వేడుకల్లో భాగంగా సంస్థకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. దాంతో స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. రెండు రోజుల పాటు సాగే ఈ మీట్‌లో అథ్లెటిక్స్, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీ బాల్ మరియు లెమన్ స్పూన్ , స్విమ్మింగ్ వంటి పలు రకాల పోటీల లో పాటు చెస్ , క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శశాంక్ ఇతర ఉన్నతాధికారులుసిబ్బంది పాల్గొన్నారు.

# కిషన్ రెడ్డికి మతిభ్రమించింది: విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. బుధవారం సిఎల్పిలో ఆయన మీడియా తో మాట్లాడారు. రాష్ట్ర సమస్యలపైన కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తుంటే రౌడీ అని కిషన్ రెడ్డి మాట్లాడటానికి సిగ్గుండాలన్నారు. నిధుల గురించి కేంద్రాన్ని, మోదీని నిలదీస్తే రౌడీ అవుతారా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే కేంద్రం నుంచి ఏం తెచ్చారో ముందు కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. సీఎం అడిగిన ప్రశ్నలకు కిషన్ రెడ్డి సమాధానం చెప్పలేక మోహం చాటేశాడని ఆయనఏద్దేవాచేశారు. కేంద్రం సహకరించపో యినా, నిధులు ఇవ్వకపోయినా సీఎంప్రజాపాలన చేస్తుంటే ఓర్వలేక కిషన్ రెడ్డిపిచ్చిమాటలు మాట్లాడుతున్నాడన్నారు. తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని తెలిపారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని కొనలేని స్థితిలో కేంద్రం ఉందన్నారు. కేంద్ర నిధుల పైన కిషన్ రెడ్డి కాకీ లెక్కలు చెపుతున్నాడని ఆరోపించారు. తెలంగాణ కు కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చిందో బహిరంగ చర్చకు మేం సిద్ధం.. మీరు సిద్ధమా అని బీర్ల ప్రశ్నించారు. తెలంగాణలో ఎప్పటికి బీజేపీ అధికారంలోకి రాదన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ నాయకులు పగటి కలలు కంటున్నారన్నారు.. కేంద్రాన్ని నిలదీసే దమ్ము ధైర్యం కిషన్ రెడ్డికి లేదని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడగలేని కిషన్ రెడ్డి ఒక దద్దమ్మ అని అయన తీవ్రంగా వ్యాఖ్యానిం చారు. కేంద్ర మంత్రి అన్నది మరిచిపోయి ముఖ్యమంత్రిని కిషన్ రెడ్డి రౌడీ అని పిచ్చిపట్టినట్లు అంటున్నాడన్నారు. తక్షణమే కిషన్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి దేవుడి పేరు చెప్పి బీజేపీ ఓట్లు అడుక్కుంటుందన్నారు. తెలంగాణ లో ఓట్లు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదని కిషన్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని బీర్ల ఐలయ్య హెచ్చరించారు.

# భూ వివాదాలకు సెల్ ఏర్పాటు చేయండి

- కలెక్టర్ ఎస్పీ జోక్యం చేసుకోవాలి

**మెట్రో న్యూస్ కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ పరిధిలో గల కాటారం మహాముత్తారం పంకన కాళేశ్వరం మండలాలలో భూ వివాదాలకు ఒక సెల్ ఏర్పాటు చేయాలని వివిధ మండలాల ప్రజలు కలెక్టర్ ఎస్పీ ని కోరుతున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం పోలీస్ స్టేషన్ నిండా భూ వివాదాలపై రైతులు పోలీస్ స్టేషన్ ఫిర్యాదులు చేసుకుంటారు. ఈ వివాదాల్లో కొంత మంది రాజకీయ నాయకుల అండ గ్రామాలలో పెద్ద మనుషులుగా సేల మనీ అవుతున్న వారి పెత్తనం విపరీతంగా ఉండడంతో సామాన్య రైతులు పోలీస్ స్టేషన్ చేరుకుంటారు. పోలీసులకు సివిల్ మ్యాటర్‌లో అధికారం లేనందున సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులకు. పడుతున్నారు. ఇలాంటి సమస్యలకు ఆయా మండల కేంద్రా ల్లో రెవిన్యూ. పోలీస్. జిపిఓ లాంటి అధికారులతో ఒక సెల్ ఏర్పాటు చేసి భూ సమస్యలు అక్కడికక్కడే తీర్చే విధంగా చర్యలు చేపట్టాలని వివిధ మండల ప్రజలు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం వచ్చే భూ సమస్యల పట్ల సరియైన పరిష్కారం లభించకపోవడంతో గంగారం శంకరం పల్లిలో గత రెండేళ్ల క్రితం జరిగిన వివాదంలో మర్డర్లు జరిగాయి. అదే ఆసరాగా తీసుకున్న కొందరు ఎలాంటి భూమికి డాక్యుమెంట్ లేకున్నా నరుకుతా చంపుతా అంటూ బెదిరిస్తూ భూములను. అక్రమించుకుంటున్నారు. వీరికి కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. గ్రా మంలో ఎందుకు ఏమో కానీ నాయకులు వారికి వత్తాసు పలుకుతున్నారు అనే సందేహాలు రైతుల్లో నెలకొంది. భయానికో . భక్తి కో పలుకుతున్నారు ఇలా ఈ ప్రాంతంలో జరగడంతో ప్రతి సంవత్సరం ఇదే తంతు జోరుగా సాగుతుంది ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఎస్పీ జోక్యం చేసుకొని రెవిన్యూ. పోలీసులకు సర్వ అధికారాలు అప్పగించి సమస్యలు సాంకూలంగా తీర్చే విధంగా ఒక సెల్‌ని ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఈ ప్రాంత రైతుల కోరుతున్నారు.

# చౌడు నేలల పునరుద్ధరణకు జిప్సం వినియోగం

- 90% సబ్సిడీపై రైతులకు జిప్సం సరఫరా
- సమస్యాత్మక నేలలకు జిప్సం ఉత్తమ పరిష్కారం



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** భూసారాన్ని మెరుగుపరచడం, ఉప్పు ప్రభావిత చౌడు నేలలను సాగుకు అనుకూలంగా మార్చడం, వేరుశనగ, వరి వంటి పంటల్లో అధిక దిగుబడులు సాధించడం కోసం రైతులు జిప్సం వినియోగాన్ని పెంచాలని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సూచించారు. బుధవారం ఆయన మీడియా తో మాట్లాడారు. రాష్ట్రంలో సాగునీటి విస్తరణ, అసమతుల్య ఎరువుల వాడకం, సరైన నీటి నిర్వహణ లేకపోవడం వంటి కారణాల వల్ల అనేక ప్రాంతాల్లో నేలల ఉప్పుదనం చౌడు క్షారత్వం పెరుగుతున్నదన్నారు. సాధారణంగా పీహెచ్ 8.2 కంటే ఎక్కువగా ఉన్న నేలలను క్షార నేలలుగా పరిగణిస్తారని తెలిపారు. ఇటువంటి నేలల్లో మొక్కలు నీరు, పోషకాలను సమర్థవంతంగా గ్రహించలేక దిగుబడులు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. సమస్యాత్మక చౌడు నేలల పునరుద్ధరణకు జిప్సం వాడకం జిప్సం కాల్షియం సల్ఫేట్‌లో సుమారు 23,24 శాతం కాల్షియం, 18 శాతం గంధకం ఉండి ఇవి పంటలకు అత్యవసర ద్వితీయ పోషకాలుగా పనిచేస్తాయని ఆయన వివరించారు. ఈ పథకం ద్వారా చౌడు నేలలను పునరుద్ధరించి భూసారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. రైతులు తమ భూములకు మట్టి పరీక్షలు చేయించుకొని, అవసరమైన మేరకు జిప్సంను వినియోగించి ప్రభుత్వ సబ్సిడీ సదుపాయాన్ని పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం రైతులు తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారి మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ శాఖ కార్యాలయాలు లేదా రైతు వేదికలను సంప్రదించవచ్చని వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, పేర్కొన్నారు.

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి చేయూత



- ఘనా ఉన్నతస్థాయి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఆ దేశంలో ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 గంటల ఎకానమీ ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో మంత్రికి వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఆనతి కాలంలోనే పారిశ్రామికరంగం లో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.



# సుపరిపాలనే అతిపెద్ద పరీక్ష



## ప్రధానిగా మోదీ కొత్త రికార్డు.. కంగ్రాట్స్ చెప్పిన రాష్ట్రపతి ముర్ము

ఢిల్లీ (మెట్రోన్యూస్): భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ కొత్త రికార్డు క్రియేట్ చేశారు. అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా చేసిన వ్యక్తిగా ఆయన నిలిచారు. గతంలో నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. ప్రధాని ఆఫీసులో 4399 రోజుల పాటు మోదీ వరుసగా ఆ బాధ్యతలను నిర్వర్తించారు. కేంద్రంలో 12 ఏళ్ల పాటు ప్రధానిగా ఉన్న మోదీకి ఇవాళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము(ాతీవంఆసవత్ ణతీశీబజూఖసఆ వీబతీఎబ) శుభాకాంక్షలు తెలిపారు. అతిసుదీర్ఘ కాలం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన విశిష్ట గౌరవాన్ని పొందారని ముర్ము తన స్టేట్మెంట్‌లో తెలిపారు. భారత ప్రజలు మీ నాయకత్వంపై ఉంచిన నమ్మకానికి ఈ అసాధారణ మైలురాయి ఓ పరీక్షగా నిలుస్తుందని, నమ్మకానికి.. విశ్వాసాన్ని చాటుతుందన్నారు.

# 12 ఏళ్లపాలనపై మోది

ఇంటర్నెట్డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడుc అని మోదీ రాసుకొచ్చారు.ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు. cకొందరు నాయకులు దేశాన్ని పాలిస్తారు. చాలా కొద్దిమంది మాత్రమే దేశ గతిని మార్చేస్తారు. వారిలో ఒకరే ప్రధాని మోదీ. ఒక సామాన్యుడి ఇంటిలోని నీటి కుళాయి నుంచి చంద్రయాన్తో చంద్రుడిని చేరేవరకు.. పొలంలోని రైతు ఆకాంక్షల నుంచి సరిహద్దుల్లోని సైనికుడి ధైర్యం వరకు మోదీ నాయకత్వం దేశ విశ్వాసాన్ని, సామర్థ్యాలను బలోపేతం చేస్తూనే ఉంది. ప్రగతి ఫలాలు ప్రతి భారతీయుడికి చేరేలా చూసింది. ఆయన పాలనలో సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను పాటించారు. బలహీనులకు మద్దతిస్తూనే.. అవకాశాలను విస్తరించి భారత ఆర్థిక పునాదులను బలోపేతం చేసే సంస్కరణలను మేళవించారు. కరుణ, ఆశయం రెండూ కలిసి సాగగలవని ఆయన నిరూపించారు. ఈ అద్భుతమైన మైలురాయిని సాధించిన ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నా. స్వర్ణాంధ్రను నిర్మించడానికి.. వికసిత్ భారత్ సాకారం అయ్యేందుకు కట్టుబడి ఉన్నాం – ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

## నామినేషన్ తిరస్కరణ వెనుక తెలంగాణ కేసు!

# భగ్గుమన్న కాంగ్రెస్ వాదులు



హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వాదులు భగ్గుమంటున్నారు. ఇప్పటివరకు వోట్ చోరీనే చూశాం... ఇప్పుడు సీట్ చోరీ కూడా చూస్తున్నామని బీజేపీపైనా.. ఎన్నికల సంఘంపైనా మండిపడుతున్నారు. ఏఐసీసీ పెద్దలు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా అన్ని రా(ష్ట్రాల ముఖ్యులు, బాధ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీనిపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. ప్రజల మద్దతుతో గెలవలేని పరిస్థితిలో ప్రత్యర్థులను కుట్రపూరితంగా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోందని అంటున్నారు. నినిమధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మూడో సీటు కోసం మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. రెండు సీట్లు ఖాయంగా గెల్చుకోనున్న అధికార బీజేపీ మూడో సీటు పైనా కన్నేసింది. అందుకే అభ్యర్థిని నిలబెట్టింది. అప్పుడే క్రాస్ ఓటింగ్‌కు బీజేపీ ప్రోత్సహిస్తోందనే వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తన ఎమ్మెల్యేలను కాపాడుకునే యత్నం చేసింది. పోలింగ్ అనివార్యమైన నేపథ్యంలో ఎన్నికల అధికారి మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను తిరస్కరించడం వివాదాస్పదంగా మారింది. తెలంగాణలో నమోదైన ఓ కేసు విషయాన్ని మీనాక్షి ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని ఎన్నికల సంఘం అధికారి వివరణ ఇచ్చారు. ఈనెల 18న రాజ్యసభకు ఎన్నికలు జరగనున్నాయి.నినిఇంతకూ తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై నమోదైన కేసు ఏమిటి... ఆ వివరాలను ఆమె ఎన్నికల అఫిడవిట్‌లో ఎందుకు ప్రస్తావంచలేదు..! వివరాల్లోకి వెళితే... నారాయణపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కుంభం శివకుమార్ రెడ్డిపై ఓ మహిళ లైంగిక వేధింపులు, ప్రాణహాని బెదిరింపుల ఆరోపణలతో పోలీసు కేసులు నమోదయ్యాయి. ఆయనపై పార్టీ చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తార్నాకకు చెందిన ఎ. శ్రీలత 2025 ఆగస్టు 28న హైదరాబాద్ నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజి(స్టేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌లో మీనాక్షీ నటరాజన్, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్నికరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి వాకిటి శ్రీహరి తదితరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నినిబాధితురాలు తన ఫిర్యాదులను కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. మీనాక్షీ నటరాజన్ శివకుమార్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారని అబద్దాలు చెప్పారని... ఆయన్ను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు మీనాక్షీ నటరాజన్ సహా పలువురికి సమన్లు జారీ చేసింది. అయితే ఈ కేసు తాలూకు వివరాలను రాజ్యసభ నామినేషన్ పత్రాల్లో వెల్లడించలేదనే కారణంతో మీనాక్షి నామినేషన్ తిరస్కరణకు కారణం కావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.





## తమిళ సినీ దిగ్గజం అస్తమయం

### ప్రముఖుల నివాళులు

ఇంటర్నెట్ డెస్క్: దక్షిణాది చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీ రాజా (85) కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. భారతీరాజా మరణ వార్తతో తమిళ సినీ పరిశ్రమతో పాటు దేశవ్యాప్తంగా సినీ అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 2025 మార్చిలో భారతీరాజా కుమారుడు మనోజ్ భారతీ రాజా కేవలం 48 ఏళ్ల వయసులో గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఈ విషాదాన్ని భారతీరాజా తట్టుకోలేకపోయారని కుటుంబ సభ్యులు, సన్నిహితులు చెబుతుంటారు. కొడుకు అంత్యక్రియల సమయంలో ఆయన తీవ్ర ఆవేదనకు గురైన దృశ్యాలు అప్పట్లో అందరినీ కలచివేశాయి. పుత్రశోకం నుంచి పూర్తిగా కోలుకోలేకపోయిన భారతీరాజా ఆరోగ్యం క్రమంగా మరింత బలహీనపడింది.

## టీఎంసీలో ఆగని సంక్షోభం

### పెరుగుతున్న అసమ్మతి



ఢిల్లీ (మెట్రోన్యూస్): పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం మరింత ముదురుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి సెగలు ఇప్పుడు ఢిల్లీకి పాకాయి. తాజాగా ఆ పార్టీకి చెందిన మరో రాజ్యసభ ఎంపీ సుస్మితా దేవ్ తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ వారంలోనే టీఎంసీ నుంచి వైదొలగిన రెండో రాజ్యసభ సభ్యురాలు ఈమె కావడం గమనార్హం.రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపిన తన రాజీనామా లేఖను తక్షణమే ఆమోదించాలని సుస్మితా దేవ్ కోరారు. రాజీనామా చేసిన కొద్దిసేపటికే, ఆమె ఢిల్లీలో అసోం ముఖ్యమంత్రి, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మతో ఆయన నివాసంలో నవ్వుతూ కనిపించిన ఫోటోలు బయటకు వచ్చాయి. ఈ కలయిక వెనుక ఉన్న కారణాలపై విలేకరులు ప్రశ్నించగా, ఇది కేవలం అసోం కనెక్షన్ మాత్రమే అంటూ ఆమె సమాధానం దాటవేశారు.



## శిక్షణార్థులకు మంత్రి సీతక్క సర్టిఫికెట్‌ల ప్రదానం

హైదరాబాద్ (మెట్రో న్యూస్) : కుట్టు మిషన్ లో శిక్షణ పొందిన మహిళలకు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సర్టిఫికెట్ ల ప్రదానం చేశారు. బుధవారం గాంధీ భవన్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.కాంగ్రెస్ నాయకురాలు బొజ్జ సంధ్యారెడ్డి నిర్వహిస్తున్న మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 3,000 మంది మహిళలు కుట్టు మిషన్ శిక్షణ పొందారు. వారికీ నేడు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమం లో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యే మందుల శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ

### సీఈసీని ఆశ్రయించిన కాంగ్రెస్ నేతలు

ఢిల్లీ (మెట్రోన్యూస్): రాజ్యసభ ఎన్నికలకు ముందు తగిలిన ఎదురుదెబ్బపై పోరాటం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకుంది. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలిసి తమ అభ్యంతరాలను తెలియజేసింది.


## భార్యను తుపాకితో కాల్చిచంపిన భర్త

హైదరాబాద్ (మెట్రోన్యూస్): హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త, ఆమెను తుపాకీతో కాల్చి చంపాడు. మల్కాజ్‌గిరి మారుతి నగర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

అరుణ్ అనే వ్యక్తికి పదేళ్ల క్రితం ఓ మహిళతో వివాహమైంది. అయితే, వేధింపుల కారణంగా ఆమె విడిపోయి దూరంగా ఉంటోంది. అనంతరం ఆమె సొంత చెల్లెలైన ఉషారాణితో అరుణ్ సహజీవనం మొదలుపెట్టి, ఐదేళ్ల క్రితం యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి మారుతి నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు.


కొంతకాలంగా ఉషారాణి మరొకరితో ఫోన్‌లో చాటింగ్ చేస్తోందని అరుణ్ అనుమానించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



### జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కు వరంగల్ ఎంపీ కావ్య విజ్ఞప్తి

ఢిల్లీ (మెట్రోన్యూస్): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ కాస్ట్స్ ఆర్డర్–1950 పేరా–3ను తొలగించాలని వినతి పత్రం అందజేశారు. బుధవారం ఢిల్లీలో జస్టిస్ బాలకృష్ణన్‌తో భేటీ అయిన కావ్య... మత మార్పిడితో కుల వివక్ష తొలగిపోదన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. దళిత క్రైస్తవులకు విద్య, ఉద్యోగాల్లో రాజ్యాంగబద్ధమైన అవకాశాలు కల్పించాలని కోరారు. రాజ్యాంగ ఆర్టికల్స్ 14,15,16,46 స్ఫూర్తిని అమలు చేయాల్సిన అవసరం ఉందని... జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సహా పలు కమిషన్ల సిఫార్సులను అమలు చేయాలని అభ్యర్థించారు.



## ఖర్గేకు మంత్రి వాకిటి శుభాకాంక్షలు

హైదరాబాద్ (మెట్రో న్యూస్):రాజ్యసభకు మరోసారి ఎంపికైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. తాజాగా కర్ణాటక నుంచి ఖర్గేను మరోసారి నామినేట్ చేయడంతో... ఆయన ఏకగ్రీవ ఎన్నిక లాంఛనప్రాయమే. ఈ నేపథ్యంలో ఖర్గేను రాష్ట్ర మంత్రి పుష్పగుచ్ఛం ఇచ్చి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఖర్గే విశేష అనుభవం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత దోహదపడుతుందని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

# ఎల్ నినో గుప్పిట్లో భారతదేశం?
# అయితే కరువు లేకపోతే వరదలు!

## //ఎడిటోరియల్//

పసిఫిక్ మహాసముద్రంలో అత్యంత శక్తివంతమైన ఎల్ నినో ప్రక్రియ ప్రారంభమైందని..ఇది రికార్డు స్థాయి తీవ్రతకు చేరుకునే అవకాశం ఉందని యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్ తాజా అంచనాలు హెచ్చరిస్తున్నాయి. భూమధ్యరేఖ వెంబడి ఉన్న పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఈ ఏడాది నవంబర్ నాటికి సాధారణం కంటే ఏకంగా 3.5 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర పెరిగే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. చరిత్రలోనే అత్యంత తీవ్రమైన పరిణామాలలో ఒకటిగా నిలవబోతున్న ఈ మార్పు... ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థలను అతలాకుతలం చేసే ముప్పును తెచ్చిపెడుతోంది. పసిఫిక్ సముద్రంలో వచ్చే ఈ మార్పులు కొన్ని ప్రాంతాలలో తీవ్రమైన కరువులకు, మరికొన్ని ప్రాంతాలలో ముంచెత్తే వరదలకు కారణం కానున్నాయి. భూమధ్యరేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడమే ఎల్ నినో. ఈ ఉష్ణోగ్రత మార్పులు సముద్రానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశాల వాతావరణాన్ని సైతం శాసిస్తాయి. సముద్రపు నీరు వేడెక్కినప్పుడు వాతావరణ గాలి ప్రసరణలో భారీ మార్పులు సంభవిస్తాయి. ఇది అంతర్జాతీయంగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, తుఫానుల గమనాన్ని పూర్తిగా మార్చేస్తుంది. గతంలో సంభవించిన బలమైన ఎల్ నినోల వల్ల ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడమే కాకుండా.. ఊహించని ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. భారతదేశానికి ఎల్ నినో ముప్పు అత్యంత ప్రమాదకరమైనది. ఎందుకంటే దేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతం వాటాను అందించే నైరుతి రుతుపవనాలపై ఎల్ నినో తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ప్రతి ఎల్ నినో సంవత్సరం కరువుకు దారితీయకపోయినా.. భారతదేశ చరిత్రలో నమోదైన అత్యంత దారుణమైన కరువు సంవత్సరాలన్నీ బలమైన ఎల్ నినో ప్రభావంతో ముడిపడి ఉన్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. పసిఫిక్‌లో పెరుగుతున్న ఈ వేడి 2026 చివరి నాటికి .. 2027 లో దేశవ్యాప్తంగా వర్షపాతాన్ని భారీగా తగ్గించి.. తీవ్రమైన సాగునీటి, తాగునీటి కొరతకు కారణం కావచ్చు. వర్షపాతం తగ్గడమే కాకుండా... ఎల్ నినో ప్రభావం వల్ల దేశంలో ఎండ తీవ్రత -ఉష్ణోగ్రతలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాలు వర్షాలు లేక కరువుతో ఎండిపోతుంటే...వాతావరణ అసమతుల్యత కారణంగా మరికొన్ని ప్రాంతాలు అకస్మాత్తుగా ముంచెత్తే అకాల భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలం అయ్యే విచిత్రమైన పరిస్థితులు తలెత్తవచ్చు. అయితే రానున్న నెలల్లో సముద్ర గమనాన్ని బట్టి ఈ కాలానుగుణ అంచనాలలో మార్పులు వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. పసిఫిక్ మహాసముద్రం వేడెక్కే ఈ ధోరణి ప్రస్తుత మార్గంలోనే కొనసాగితే... భారతదేశ వ్యవసాయ రంగం, ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్లైమేట్ ఏజెన్సీలతో పాటు భారతీయ వాతావరణ శాస్త్రవేత్తలు కూడా పసిఫిక్ ఉష్ణోగ్రతలను నిరంతరం నిశితంగా గమనిస్తున్నారు. రానున్న కొద్ది నెలల్లో వెలువడే వాతావరణ నివేదికలు ఎల్ నినో కచ్చితమైన తీవ్రతను...అది మన రుతుపవనాలపై చూపే స్పష్టమైన ప్రభావాన్ని నిర్ణయించనున్నాయి. హైదరాబాద్ సహా పలు మెట్రోల్లో భీభత్సమైన వర్షం కురవడం లేదా అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడం కూడా ఎల్.నినో ప్రభావంగానే చూడవచ్చు.

## స్ఫూర్తి చిహ్నాలు!

మెట్రో డైలీ

పతకాలు కావవి
ప్రతిభకు సూచకాలు.
లోహం,గాజు,చెక్క లేదా ప్లాస్టిక్‌తో
మలిచిన ఘనరూపాలు
సన్మాన సభల్లో సాంప్రదాయంగా ఇచ్చే
నిసత్కార చిహ్నాలు.
ఒకటి వస్తే ఆనందం
అవి పదికి మించితే 'షెల్ఫ్'ల నిండా
తొణికిసలాడే గౌరవం వంద దాటితే
అటకల మీద రాజ్యమేలుతూ
మొత్తం ఇంటినే మార్చేస్తాయి
ఓ చిన్న 'స్మారక గ్యాలరీ' లా!
ఇన్ని మెమెంటోల నడుమ
నేర్చుకోవాలి ఒక గొప్ప సత్యం..
గౌరవం ఎప్పుడూ
ఏ బరువుతో కొలవలేమని!
అవి గౌరవానికి గుర్తులే కానీ
ఇంట్లో ఉన్న స్థలానికి శిక్ష కాకూడదని!
మెమెంటో ఒక వస్తువు కాదు
ఒక ప్రేరణ.. ఒక గుర్తింపు
అందుకే అది మన ఇంటిలో కాదు
కృషిలో మెరుస్తేనే సజీవం.
ఏది నిజమైన మెమెంటో?
ఇంట్లో అటకల మీద తిష్ట వేసిన
ఈ కృత్రిమ వస్తువులా?
సమాజపు గుండెల్లో
మనం వదిలిన ప్రతిభా ముద్రలా?
జమైన సన్మానం
ఏ రూపం లేని ఒక అనుభూతి.
వస్తువుల్లో దాచలేనిది
షెల్ఫ్ లలో బంధించలేనిది.
ఈ అనంత విశ్వ వేదికపై
ఎప్పుడో ముగిసిపోయే ఈ జీవితంలో
మనమే ఒక మెమెంటో!

-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

# భారత చరిత్రలో నెహ్రూ రికార్డును అధిగమించే దిశగా నరేంద్ర మోదీ



## మెట్రో తెలంగాణ చావడి






ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలుస్తున్నది. ప్రతి ఐదేళ్లకు ఓ సారి శాంతియుతంగా ఎన్నికలు జరుగుతున్నాయి. దేశ ప్రధానమంత్రి నుంచి వార్డు మెంబర్ వరకు ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయి. 10 జూన్ 2026 రోజు భారత ఆధునిక రాజకీయ ముఖచిత్రాన్ని మార్చి వేసే ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రజల చేత "ఎన్నికైన" ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న సుదీర్ఘ రికార్డును 10 జూన్ రోజున నరేంద్ర మోదీ అధిగమించనున్నారు. 26 మే 2014 నుంచి జూన్ 10, 2026 వరకు నిరంతరాయంగా పిఎం పదవిలో 4,399 రోజులు పూర్తి కానున్నాయి. గతంలో నెహ్రూ ప్రజాస్వామ్య బద్ధంగా "ఎన్నికైన పిఎం"గా 4,398 రోజుల పాటు (13 మే 1952 నుంచి 27 మే 1964 వరకు) సేవలు అందించారు. నెహ్రూ నెలకొల్పిన రికార్డును 10 జూన్ రోజు నరేంద్ర మోదీ బద్దలుకొట్టి అప్రతిహతంగా అత్యధిక కాలం పాటు నిరాటకంగా ఎన్నికైన పిఎంగా సేవలు అందించడం ఓ అద్భుత సందర్భం. నినినరేంద్రుడి ఖాతాలో మరో అరుదైన రికార్డు: సంక్షేమ ఆర్థిక విధానాలు, బలమైన జాతీయ భద్రత, స్పష్టమైన సాంస్కృతిక జాతీయవాదా లాంటి శక్తివంతమైన వ్యూహాలతో నరేంద్రుడు సంప్రదాయ రాజకీయ ఆధిపత్యాన్ని ఆసాంతం మార్చి వేశారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకతను తిప్పికొడుతూ ప్రజాదరణ కలిగిన ప్రభుత్వ నమూనాను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ప్రధానిగా "మొత్తం పదవీ కాలాని"కి, "ఎన్నికల ద్వారా పిఎం"గా సేవలందించిన కాలానికి వ్యత్యాసం తెలుసుకోవాలి. మన తొలి ప్రధానమంత్రి నెహ్రూ దాదాపు 17 ఏండ్ల పాటు పిఎంగా సేవలు అందించారు. కాని ఇందులో 15 ఆగష్టు 1947 నుంచి 12 మే 1952 వరకు రాజ్యాంగబద్ధంగా నామినేటెడ్ (ఎన్నికలు లేకుండా) ప్రధానిగా సేవలు అందించారు. స్వాతంత్ర్య భారతంలో ప్రజాస్వామ్య సార్వత్రిక తొలి ఎన్నికలు జరిగి 13 మే 1952 రోజున ఎన్నికైన పిఎంగా నెహ్రూ పదవీ స్వీకారం చేశారు. నాటి నుండి మే 27, 1964 రోజు తుది శ్వాస విడిచే వరకు 4,398 రోజుల పాటు ఎన్నికైన పిఎంగా సేవలు అందించారు. నరేంద్ర మోదీ 10 జూన్ 2026 రోజున అత్యధిక కాలం పాటు ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ రికార్డును బద్దలుకొట్టి 4,399 రోజులు నిర్విరామంగా పని చేసిన పిఎంగా అరుదైన ఘనతను సాధిస్తున్నారు. నరేంద్రుడు చిన్నతనంలోనే ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవక్‌గా సేవలు అందించి, ఆ తర్వాత భాజపాలో కార్యకర్తగా ఎదిగారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 07 అక్టోబర్ 2001 నుంచి నిరంతరాయంగా 22 మే 2014 వరకు సుదీర్ఘ కాలం సేవలు అందించి, ఆ తర్వాత నేరుగా పిఎంగా పదవిని చేపట్టి నేటికీ కొనసాగుతున్నారు. నినినాటి స్వతంత్ర భారత పునాదుల నుంచి నేటి డిజిటల్ శకం వరకు : భారతదేశ రాజకీయ, ప్రజాస్వామ్య పరిపాలనా చరిత్రలో 10 జూన్ 2026 ఒక సువర్ణ అధ్యాయం లిఖించబోతున్నది. నెహ్రూ రికార్డును అధిగమిస్తూ మోదీ అప్రతిహతంగా దూసుకుపోతున్నారు. నాటి "స్వతంత్ర భారత పునాదుల" నుండి నేటి "డిజిటల్ శకం" వరకు భారత పరిపాలనా ప్రస్థానం కొనసాగుతున్నది. ఈ చారిత్రక మైలురాయి కేవలం ఇద్దరు భిన్న ధృవాల వంటి అగ్ర నాయకుల పదవీకాలాలను పోల్చడం వీలుకాదు. గత ఏడు దశాబ్దాలుగా భారతదేశం ఎదుర్కొన్న సవాళ్లు, సంక్షోభాలు, పాలనా నమూనా లాంటి పరిణామాలు సమీక్షించుకోవడానికి ఇదో అరుదైన సందర్భం. శతాబ్దాల వలస పాలన తర్వాత విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థ, రాజకీయ అస్థిరత, సంస్థాగత నిర్మాణం లేని భారతానికి గట్టి పునాదులు వేయడానికి కృషి చేశారు. నాడు 34 కోట్ల ప్రజలు ఉన్న భారతం నేడు 140 కోట్ల జనాభాకు చేరింది. నాడు జనాభాతో పాటు సమస్యలు, సవాళ్లు, సంక్షోభాలు, విపత్తులు, శాస్త్ర సాంకేతిక విప్లవాలను దాటుకుంటూ నేడు డిజిటల్ ఏఐ విప్లవం ఆసరాగా భారతం ముందడుగు వేస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తున్నది. నినినరేంద్ర మోదీ మార్క్ సమగ్రాభివృద్ధి : కరోనా విపత్తు విడిచిన చేదు జ్ఞాపకాలతో టెక్నాలజీ తోడుగా, ప్రజారోగ్య గొడుగు, ఆర్థిక స్వావలంభన, వ్యూహాత్మక విదేశీ విధానాలు, యూపిఐ చెల్లింపుల వెల్లువ, సిఏఏ, స్వచ్ఛ భారత్ అభియాన్, జన్ ధన్ - ఆధార్- మొబైల్ అనుసంధానం, ఆర్థిక సమ్మిళిత అభివృద్ధి, మౌళిక వనరుల కల్పన, 370 ఆర్టికిల్ రద్దు, డిజిటల్ ఇండియా, ఆయుశ్మాన్ భారత్, రవాణా రంగ అభివృద్ధి, మేక్ ఇన్ ఇండియఅ, త్రిపుల్ తలాక్, బేటీ బచావో బేటీ పడావో, సోషల్ మీడియా ఉప్పెనలు, సంక్షేమ పథకాల నీడలను కల్పిస్తూ డిజిటల్ విప్లవ భారతం ఎదగడంలో నరేంద్ర మోదీ కృషి వెలకట్టలేనిది. నాడు రష్యా, అమెరికా అనే రెండు ప్రధాన శక్తి కూటములు ఉన్నప్పటికీ నెహ్రూ భారతం అలీన ఉద్యమ బాటన సాగింది. నేడు రష్యా-ఉక్రెయిన్, పాలస్తీనా-ఇజ్రాయిల్, అమెరికా/ఇజ్రాయిల్ - ఇరాన్ యుద్ధాల నడుమ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకుంటూ ఆర్థికవృద్ధిని నమోదు చేసుకోవడంలో నమో పాలనా నైపుణ్యం కొనియాడాల్సిందే. అమెరికా, యూరప్, రష్యా, పశ్చిమాసియా, గ్లోబల్ సౌత్ దేశాలతో సత్సంబంధాలను సమర్ధవంతంగా విస్తరించడంలో మోదీ కృతకృత్యులు కావడమే కాకుండా భారతదేశ ప్రతిష్టను ప్రపంచ దేశాల్లో ఇనుమడింపజేశారు.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# మెట్రో ఇలవేల్పు
# రామ మందిరంతో అయోధ్యకు పోటెత్తిన పర్యాటకులు

## 2025లో 20 కోట్ల మంది సందర్శకులు!



అయోధ్యలో రామ మందిరం నిర్మాణం తర్వాత ఆ నగరం పర్యాటకులకు నిలయంగా మారింది. కేవలం పర్యాటక రంగమే కాకుండా వ్యాపార సంస్థలు కూడా భారీగా లాభపడుతున్నాయని అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది. 2024లో అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం జరగగా ఆ ఏడాది 16.44 కోట్ల మంది సందర్శించారు. 2025 తొలి మూడు నెలల్లోనే 20 కోట్ల మంది సందర్శకులు వచ్చారని అధికారులు చెబుతున్నారు. అక్కడి ప్రభుత్వం కల్పించిన మౌలిక వసతులతోనే ఇది సాధ్యమయిందని తెలుస్తోంది.

2020లో అయోధ్యను సందర్శించిన 60.22 లక్షల మంది

2024 నాటికి 16.44 కోట్లకు పెరిగిన సందర్శకుల సంఖ్య

పర్యాటకులతో పాటు అయోధ్య ఆదాయంలోనూ మార్పు రామ మందిర నిర్మాణంతో అయోధ్య రూపురేఖలే మారిపోయాయి. బీజేపీ తన చిరకాల కల అయిన రామ మందిరాన్ని 2024లో పూర్తి చేసింది. దేశం గర్వించదగ్గ స్థాయిలో, ప్రపంచం మనవైపు చూసేలా నిర్మించిన రామ మందిరాన్ని వీక్షించేందుకు సందర్శకులు పోటీ పడుతున్నారు. 2024లో ఆలయ ప్రారంభోత్సవం తర్వాత అయోధ్య నగరానికి పర్యాటకుల రద్దీ భారీగా పెరిగింది. ఆలయ నిర్మాణంతో పాటు నగరంలో మౌలిక వసతులు కూడా కల్పించడంతో పర్యాటకులు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసిన వివరాల ప్రకారం 2020లో అయోధ్యను సందర్శించిన వారి సంఖ్య 60.22 లక్షలు ఉండగా.. 2024 నాటికి అది 16.44 కోట్లకు పెరిగింది. 2025 తొలి మూడు నెలల్లోనే 20 కోట్లకు పైగా సందర్శకులు వచ్చినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అయోధ్యకు సరైన రవాణా సౌకర్యం ఉండటం కూడా పర్యాటకుల సంఖ్య పెరగడంలో ప్రధానంగా కనిపిస్తోంది.ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ వివరాల ప్రకారం 2017లో అయోధ్యను 28.4 లక్షల మంది సందర్శించగా, 2022లో 2.39 కోట్ల మంది, 2023లో 5.79 కోట్ల మంది, 2024లో 16.44 కోట్ల మంది సందర్శించారు. 2025లో తొలి మూడు నెలల్లోనే ఆ సంఖ్య 20 కోట్లను దాటడం విశేషం.అయోధ్యకి పర్యాటకులు రావడానికి అనుకూలమైన రవాణా సౌకర్యం ఉంది. అయోధ్య ధామ్ రైల్వే స్టేషన్‌ను పునర్నిర్మాణం చేయగా, మహర్షి వాల్మీకి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును కూడా ప్రారంభించారు. దాంతో అయోధ్యకు చేరుకోవడం చాలా ఈజీ అయింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల నుంచి నేషనల్ హైవేలు కూడా ఉన్నాయి. పర్యాటకుల సంఖ్య పెరగడంతో వ్యాపార రంగాలు కూడా అభివృద్ధి చెందాయి. హోటల్ రంగం, రిటైల్ వ్యాపారాలు, రవాణా సేవలు, యాత్రికులకు సంబంధించిన సేవలు పెరిగాయి. ఐఐఎం లక్నో అధ్యయనం ప్రకారం రామ మందిరం ప్రారంభానికి ముందు ఒక్కో షాప్‌కి రోజుకు రూ. 400 - 500 ఆదాయం ఉంటే.. ఇప్పుడు సగటున రూ. 2,500 వరకు సంపాదిస్తున్నారని చెబుతున్నారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
కరీంనగర్-వరంగల్
పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల | హన్మకొండ, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్
epaper.metroevenings.com
తేది : గురువారం జూన్ 11 2026


## శాంతి భద్రతలు ఇంత ముఖ్యమో పర్యావరణం కూడా అంతే ముఖ్యం ఎస్సై వెంకటేష్



మెట్రో న్యూస్ శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ మండలం గ్రామపంచాయతీ కార్యాలయంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్మాట్లాడుతూశాంతి భద్రత విషయంలో ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలనిముఖ్యంగామైనర్ పిల్లలకుద్విచక్ర వాహనాలను ఇస్తూ అవగాహన లేకుండా నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని, గ్రామాలలో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత ఆకర్షితులు కావద్దని ప్రజలు తమకు ఎల్లవేళలా సహకారం అందిస్తూ మాకు అందుబాటులో ఉండాలని వారు కోవడం జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ కాలంలో ఎన్నెన్నో ప్రభావం ఎంతో ఉందని దానికి అనుగుణంగా ఆరుతడి పంటలు వేసుకోవాలని వారుసూచించడం జరిగినది డాక్టర్ శ్రీనివాస్మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యం మా ప్రధాన బాధ్యత అని రానున్న రోజుల్లో వర్షాల వలన కలిగే వ్యాధుల నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించడం జరుగుతుందని సర్పంచ్ బంగారు రమేష్ మాట్లాడుతూ పరిశుభ్ర గ్రామం గా తీర్చిదిద్దాలని తమ లక్ష్యమని పరిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించి గ్రామ వాతావరణాన్ని మెరుగు పరుచుకోవడానికి ప్రజలు తమ సహకారం అందించాలని వారు కోవడం జరిగినది. అనంతరం స్థానిక రక్షకబడ నిలయంలో ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పర్యావరణ సమతుల్యం కొరకు సర్పంచ్ పలు శాఖల అధికారులతో మొక్కలు నాటడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి. ఎస్సై వెంకటేష్, వ్యవసాయ శాఖ అధికారి సంధ్య, డాక్టర్ శ్రీనివాస్ ఆయా శాఖల అధికారులు అంగన్వాడి టీచర్లు శక్తి సంఘం సీఏలు మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లా నిర్మాణానికి ప్రజలు సహకరించాలి

## డీసీపీ బి. రామ్ రెడ్డి





మెట్రో న్యూస్ రామగుండం. పెద్దపల్లి జిల్లాను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తు పదార్థాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని డి-అడిక్షన్ సెంటర్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చికిత్స పొందుతున్న యువకులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వారిని గౌరవ న్యాయస్థానం ఆదేశాల మేరకు 15 రోజుల పాటు డి-అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నామని తెలిపారు. ఇక్కడ వారికి నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడమే కాకుండా, మానసిక మార్పు కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు.గంజాయి సరఫరా చేసే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారని, అదే సమయంలో సేవించే వారిని గుర్తించి ఆ అలవాటుకు దూరం చేస్తే సరఫరా కూడా ఆటోమేటిక్‌గా తగ్గుతుందని డీసీపీ అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, బాధితులను డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. ఈగల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డీసీపీ రామ్ రెడ్డి అధికారులతో కలిసి మొక్కలు నాటారు. డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడం విశేషం. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ పెద్దపల్లి ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, వైద్య అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి

చిగురుమామిడి: (మెట్రోన్యూస్)గ్రామాభివృద్ధికి గ్రామస్తులందరు సహకరించాలని సర్పంచ్ ఆకవరం భవానీప్రసాద్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ముగింపు గ్రామసభ బుధవారం గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధికి గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే కలిసికట్టుగా పరిష్కరించుకొని, ముందుకు నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎంపీడీవో రామ్మోహన్ చారి,ఎంపీఓ కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి



కాల్వ రమేష్,సఖి కేంద్రం అధికారి లక్ష్మి. ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుల్తానా, ఏఈఓ ఖలీల్, ఏపీవో రాజు,ఎస్సీ హాస్టల్ వార్డెన్ మహేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి,వార్డు సభ్యులు పోతర్ల శివాంజనేయులు, పోతరవేణి అనిల్,వెనుకుల శ్రీనివాస్,వేల్పుల భాగ్య, అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు,ఐకెపి సీఏలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 25వ వార్డులో వార్డు సభ, ఇందిరమ్మ చీరల పంపిణీ



జగిత్యాల జిల్లా/కోరుట్ల, జూన్ 10 (మెట్రో న్యూస్) : 25వ వార్డులో వార్డు సభను నిర్వహించి, ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని 25వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కలాల రాధ సాయిచంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక వార్డు సభను మార్కండేయ టెంపుల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాధ సాయిచంద్ మాట్లాడుతా వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ అధికారులతో కలిసి కౌన్సిలర్ రాధ సాయిచంద్ మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బశీది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## కర్రసాము విద్యలో జాతీయ స్థాయి అద్భుత ప్రతిభ కనబరిచిన మాస్టర్ రమేష్



జగిత్యాల జిల్లా/కోరుట్ల, జూన్ 10 (మెట్రో న్యూస్) : జాతీయ స్థాయిలో కర్రసాము విభాగంలో మాస్టర్ నావనంది రమేష్ అద్భుతంగా రాణించారు. ఈ నెల 7, 8, 9, 10 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సింహపురి నగరం (నెల్లూరు)లో కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కర్రసాము శిక్షణా శిబిరం, సెమినార్‌లో తెలంగాణ రాష్ట్రం, జగిత్యాల జిల్లా, కోరుట్లకు చెందిన మాస్టర్ తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకులు, తైక్వాండో నేషనల్ కోచ్ మాస్టర్ నావనంది రమేష్ పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరంలో కర్రసాము విద్యలో విశేష ప్రతిభ కనబరిచిన మాస్టర్ నావనంది రమేష్, కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్‌ను విజయవంతంగా సాధించారు. ఈ సర్టిఫికెట్‌ను కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎం. శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయస్థాయి కర్రసాము సర్టిఫికెట్ సాధించిన రమేష్ ను తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ జి సంతోష్ కుమార్ మాస్టర్, జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ కోల గంగారావు మాస్టర్లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు రాజేందర్ మాస్టర్, శ్రీనివాస్ మాస్టర్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## యాంటీ డ్రగ్ అవగాహనతో వృక్షారోపణ కార్యక్రమం

### రౌడీ షీటర్లు, లతో మొక్కలు నాటించిన పోలీసులు



గంగాధర, మెట్రో న్యూస్: "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా గంగాధర పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం యాంటీ డ్రగ్ అవగాహన మరియు పర్యావరణ పరిరక్షణ సందేశాలతో వృక్షారోపణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది స్టేషన్ ఆవరణలో పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం ప్రతి నెల కౌన్సెలింగ్‌కు హాజరయ్యే సుమారు 15 మంది రౌడీ షీటర్లు, లతో కూడా మొక్కలు నాటించారు. మొక్కలను సంరక్షించడం ద్వారా ప్రకృతిని కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత, కుటుంబ మరియు సామాజిక జీవితాలపై కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. పోలీసు శాఖ చేపడుతున్న ప్రజా చైతన్య కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు.

# పాలనాపరంగా నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ"

### హర్షం వ్యక్తం చేసిన భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు



జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 10 (మెట్రో న్యూస్) : భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలన పగ్గాలు చేపట్టి నేటితో 4399 రోజులు పూర్తి చేసుకోవడం పాలనాపరంగా గొప్ప విజయమని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు అన్నారు. దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ఘనత మోడీకే దక్కిందని ఆయన కొనియాడారు. దేశంలో ఇప్పటివరకు ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన రికార్డు నెహ్రూకు ఉండగా ఇప్పుడు ఆ రికార్డును అధిగమిస్తూ సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన ఘనత మోడీ సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. మోడీ తన 12 ఏళ్ల పరిపాలన కాలంలో 81 కోట్ల మందికి ఉచిత రేషన్ అందించారని, పి ఎం ఏ వై ద్వారా నాలుగు కోట్లకు పైగా ఇల్లు నిర్మించాలని మహిళలకు యువతకు పెద్దపీట వేశారని ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని మోడీ పాలనలోనే భారత్ విశ్వ గురువుగా అవతరిస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మోడీకి శుభాకాంక్షలు తెలుపుతూ మోడీ పేరున స్థానిక మార్కండేయ దేవాలయంలో పూజలు నిర్వహించి, వారు ఆయురారోగ్యాలతో సంపూర్ణ జీవితము గడపాలని దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆశించారు మోడీ నవభారత నిర్మాత అని ప్రపంచంలో భారతదేశాన్ని ఒక శక్తివంతమైన దేశంగా నిలిపే శక్తి సామర్థ్యాలు మోడీకి మాత్రమే ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో 22 వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, నాయకులు సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, వేముల పోచ మల్లు, సిరిపురం గంగారం, ఆర్ఎస్ఎస్ వీరన్న, బొందుకూరి శ్రీనివాస్, పుప్పాల సత్యనారాయణ, ఎడమల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రేణుక ఎల్లమ్మ బోనాలు

జగిత్యాల జిల్లా/కోరుట్ల, జూన్ 10 (మెట్రో న్యూస్) : కోరుట్ల మండలం చిన్న మెట్ పెల్లి గ్రామం లో రేణుక ఎల్లమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం "ఎల్లమ్మ" బోనాలను డప్పుల చప్పులతోని, సుమారు 100 మంది గౌడ సంఘం సభ్యులు బోనాలు తీసారు. ఈ బోనాల కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు డాక్టర్, గొల్లపెల్లి చంద్రశేఖర్ గౌడ్, కోరుట్ల గౌడ సంఘం మండల అధ్యక్షులు బొల్లెపల్లి శ్రీనివాస్ గౌడ్, మెట్ పెల్లి మాజీ సర్పంచ్ పుదారి నర్సాగౌడ్ లు బోనాలు ఎత్తుకన్నారు. తుపాకుల ప్రకాష్ గౌడ్, చిన్న మెట్ పెల్లి పి ఏ సి ఎస్ చైర్మన్ బండి భూమయ్య గౌడ్, పడాల మారుతి గౌడ్, పడాల శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు మొత్కూరి సత్యం గౌడ్, ఆనంద్ గౌడ్, పడాల హనుమాన్లు గౌడ్, సురేష్ గౌడ్, శేఖర్ గౌడ్,







మరిపెల్లి ప్రతాప్, మరిపెల్లి రాము, మరిపెల్లి విజయ్, కుంట రాజా గౌడ్, గౌడ సంఘం సభ్యులు, మహిళలు బోనాలు ఎత్తుకొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేసారు.

## రేగొండలో ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూం ప్రారంభం..



రేగొండ,జూన్10(మెట్రో న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఎస్ ఎస్ అగ్రిటెక్ ప్రొప్రైటర్ సిరికొండ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూంను బుధవారం ప్రారంభించారు.వాసవి మోటార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూం నందు ఎలక్ట్రికల్ స్కూటీలు, ఎలక్ట్రికల్ ఆటోలు, ఎలక్ట్రికల్ సైకిల్, అందుబాటులో ఉంటాయని ఈ సందర్భంగా నిర్వహకులు తెలియజేసినారు. కాలాను గుణంగా పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలను గమనించి, వాతావరణ కాలుష్యం కానటువంటి ఎలక్ట్రికల్ వెహికల్స్ లను ఉపయోగించు కోవాలని వినియోగదారులు, ప్రజలకు తెలియజేశారు.ప్రారంభోత్సవ ఆఫర్ గా మొదటి రెండు రోజులు,ప్రతి వెహికల్ పై ఐదువేల తగ్గింపు ధరకు ఇస్తున్నామని,ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ప్రజలు వినియోగించుకోవాలని అగ్రిటెక్ తిరుపతిరావు కోరారు. ఎలక్ట్రానిక్ వెహికల్స్ ఉపయోగి ంచుకునే నియోగదారులకు కావాల్సిన ధరలకు మాడల్ వెహికల్ అందుబాటులో ఉంటాయని, ఎలక్ట్రికల్ వెహికల్స్ తో కాలుష్య నివారణతో పాటు, డీజిల్ పెట్రోల్ ఖర్చులు ఎంతో ఆదా అవుతాయని ఇలాంటి అవకాశాలను తీసుకోవాలని శ్రీ అగ్రిటెక్ యజమాని తిరుపతిరావు సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు, కస్టమర్లు యువకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ కల్పించాలి

### టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేత



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య (జాని), కార్యదర్శి ముషం హరిప్రసాద్ లు జిల్లా కమిటీ పక్షాన విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో అనేక మంది జర్నలిస్టులకు ఎలాంటి వేతనాలు లేకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేక పోతున్నారని, ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ డైరీ ని అందజేశారు. కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి నందిపాటి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు, వంగాల వెంకన్న, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షులు చాంద్ పాషా, చివ్వెంల మండల అధ్యక్షులు కొంగల సతీష్, జర్నలిస్టులు ఎస్. అనిల్ కుమార్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ శిక్షణ

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల పిల్లలకు కూడా అత్యాధునిక సాంకేతిక అవకాశాలు దక్కాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను భవిష్యత్తు సాంకేతికత వైపు నడిపించేందుకు సూర్యాపేట జిల్లా అధికారులు డిజిటల్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య ద్వారా విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. టీ-ఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ సంస్థల సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నెల రోజుల ఏఐ శిక్షణా కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ శిక్షణా కార్యక్రమం 2026 జూన్ 15 నుండి జూలై 11 వరకు నెల రోజుల పాటు కొనసాగనుంది. మొదటి విడతగా జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో దీనిని నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో రాణించడానికి ఏఐ అక్షరాస్యత ఎంతో కీలకమని, ఇది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి భారతదేశ డిజిటల్ పరివర్తన ప్రయాణంలో వారిని భాగస్వాములను చేస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ మరియు డిజిటల్ సాధనాలను బాధ్యతాయుతంగా ఎలా వాడుకోవాలో నేర్పడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను మెరుగయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

**పైలెట్ ప్రాజెక్టు గా సూర్యాపేట**

ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని వందలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయితే, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను విస్తరించడానికి ఇదొక రోల్ మోడల్‌గా నిలుస్తుందని విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫ్ఫార్, మరియు టీ-ఫైబర్, సూపర్ టీచర్ ఎడ్యు రిఫార్మ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాన నీటి సంరక్షణ కోసం ఇంకుడుగుంతల నిర్మాణం చేయాలి




### మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి వార్డులో కూడా ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయడానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 46వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో46 వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు వార్డు ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి తమ స్పందన తెలియజేశారని వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా కొంతమందికి పెన్షన్లు రావాల్సి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల కోసం చాలామంది ఎదురుచూస్తున్నారని, సొంత స్థలం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వార్డు మహిళలకి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా ఇంటి ముందు ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవడం ద్వారా వాననీటిని సంరక్షణ చేయాలని లేనట్లయితే భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ఈ ఎండాకాలం చాలామంది ఇంట్లో భూగర్భ జలాలు ఇంకిపోయి, బోర్ వెల్స్ లో నీరు రాక ఇబ్బందులు పడినారని ఇటువంటి ఇబ్బందులు రాకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు కూడా ఇంటిముందు ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలని అన్నారు. వేసవిలో ప్రజలు తట్టుకోలేని ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని, ప్రతి ఒక్కరు కూడా చెట్లు పెంచడం ద్వారా అదిక ఉష్ణోగ్రతలు తగ్గించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, మేనేజర్ బుచ్చిబాబు, టిఎంసి శ్వేత, 33 వార్డ్ కౌన్సిలర్ నాగుల వాసు, 46 వార్డు ఇంచార్జీ దంతాల సాయి నవీన్ , జూనియర్ అసిస్టెంట్ గౌసుద్దీన్, వార్డు అధికారి రాజేశ్వరి సి ఓ ఉమారాణి, రోజా, జవాను ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

## మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగంపై పటిష్టమైన నిఘా పెట్టాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్ మెట్రో న్యూస్ ; బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో (నార్కోటిక్స్ కోఆర్డినేషన్) సమావేశంలోజిల్లా కలెక్టర్, ఎస్పీఅక్షాంక్ష్ యాదవ్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,అడిషనల్ ఎస్పి లక్ష్మీనారాయణ తో కలిసి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తి గారి కట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతకు అవగాహన కార్యక్రమాలుహావిస్తృతంగా నిర్వహించాలని, కౌన్సెలింగ్ లు ఇవ్వాలని సూచించారు. విద్యా సంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. విద్యార్థులను దుష్ప్రవర్తనల నుండి దూరంగా ఉంచేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ మరియు వార్డు స్థాయిలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, వాటి కార్యకలాపాలను క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. అదే విధంగా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ డ్రగ్స్ సరఫరా, నిల్వ మరియు వినియోగంపై కఠిన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేసి డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూహౌ గ్రామాలలో డ్రగ్స్ పై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. యువత డ్రగ్స్ కి అలవాటు పడకుండా చూడాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంపు ద్వారా డ్రగ్స్ వినియోగాన్ని తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. బారిన పడకుండా విద్యార్థులకు కౌన్సిలింగులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నార

## కరెంట్ షాక్ తో యువకుడు మృతి

మెట్రో న్యూస్ (జూన్ 10 ),మఠంపల్లి:మఠంపల్లి మండల పరిధిలోని లాలీ తండా గ్రామంలో బుధవారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బానోత్ భీముడు (29) తన ఇంట్లో ఉన్న మోటార్ స్విచ్ ను ఆన్ చేసే క్రమంలో ఒక్క సారి షాక్ కు గురి అయి మోటార్ పై పడి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన వచ్చి పరిశీలించారు. కోన ఊపిరితో ఉన్న భీముడును ఆటోలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడు కుటుంబ పోషణ కోసం టెంట్ హౌస్ వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ఉండేవాడని అతని మృతి జీర్ణించుకోలేకపోతున్నామని మిత్రులు,స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు మఠంపల్లి పోలీసులు తెలిపారు.

## ఎమ్మెల్యే సార్.. రోడ్డును ఏర్పాటు చేయండి

### కూనంనేనికి బస్తీవాసులు వినతి పత్రం



కొత్తగూడెం ఆర్ సి (మెట్రో న్యూస్):కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం 15వ డివిజన్ పరిధిలో కొత్తూరు రాజాం బస్తి పోచమ్మ గుడి ఏరియా నుండి విజయవాడ జగదల్పూర్ జాతీయ రహదారి వరకు నూతనంగా రోడ్డు ఏర్పాటు చేయాలని బస్తీ వాసులందరూ బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ ఏరియాలో అంబులెన్స్ వెళ్లి రావడానికి రహదారి సక్రమంగా లేదని 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పోచమ్మ తల్లి దేవాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు రహదారి నిర్మాణం చేపట్టి బస్తి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. రోడ్డుకు అనుకూలమైన స్థలం ఉండాలని ఎమ్మెల్యే వారిని అడిగారు. ముదిరాజ్ భవనం పక్కన కావలసిన అంత స్థలము ఉందని అందులో కొద్దిగా అంబులెన్స్ రాకపోకలకు అనుకూలమైన రోడ్డుకు అవసరమైన స్థలం కేటాయించాలని కోరారు. ప్రజల అవసర నిమిత్తం రోడ్డు నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో కొత్తూరి మదనయ్య, రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ముస్తఫా, కొత్తూరి రవికుమార్, సంపత్ కుమార్, చుక్కయ్య, పెరక కిరణ్, కొమ్ము శివ, దాసారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం...

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు

### మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సహా సంక్షేమ పథకాలు అమలు

### మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం

### పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి

### స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించాలి

### 3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం మెట్రో ఈవెనింగ్ జూన్ 10ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ. 3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరంలోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు.

సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ. 600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు అభివృద్ధి పనులు కూడా కొనసాగుతున్నా యని తెలిపారు. నగర సుందరీకరణ, పచ్చదనం పెంపుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుమారునికి చికిత్స కోసం ఆర్థిక సహాయం

### చేయూత అందించిన టి.జె.ఎఫ్ జర్నలిస్ట్ యూనియన్



ఖమ్మంమెట్రో ఈవెనింగ్ జూన్ 10 : వి ఫైవ్ కోఆర్డినేటర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఇన్చార్జ్ కే. వెంకటేశ్వర్లు ( కే. వి) కుమారునికి శస్త్ర చికిత్స కోసం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా కమిటీ చేయూత అందించింది. కే. వి. కుమారునికి తీవ్ర అనారోగ్య సమస్య తలెత్తి వెన్నుముక్కకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పొందుతున్న సమాచారం తెలుసుకున్న టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు బుధవారం ఖమ్మంలో జర్నలిస్టు కెవికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈసందర్భంగా వారు స్పందిస్తూ.టీయూడబ్ల్యూజే (టి జె ఎఫ్) జిల్లా కమిటీ బాధిత జర్నలిస్టు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కష్టకాలంలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక సహకారాన్ని ఇప్పటికే అనేకమందికి తమ యూనియన్ పక్షాన సహాయ సహకారాలు అందించి ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, నాయకులు కళ్యాణ్, జక్కుల వెంకటరమణ, సుధాకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లాకు మహేందర్ నాథ్ పేరు పెట్టాలి.

**డీసీసీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ.**

**వ్యక్తి కాదు-వ్యవస్థ ముఖ్యమన్న మరో అంబేద్కర్ మహేందర్ నాథ్.**

**నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి.**

**మహేందర్ నాథ్ ఆశయాలే సమాజాభివృద్ధికి మార్గదర్శకాలు,**



నాగర్ కర్నూల్ బ్యూరో :----(మెట్రో న్యూస్:జూన్ 10)మాజీ మంత్రి,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,ఈ ప్రాంతానికి మరో అంబేద్కర్ గా పేరుగాంచిన పుట్టపాగ మహేందర్ నాథ్ పేరును నాగర్‌కర్నూల్ జిల్లాకు నామకరణం చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు,అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ కోరారు. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనంలో పుట్టపాగ మహేందర్ నాథ్ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.పుట్టపాగ మహేందర్ నాథ్ శతజయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు ఆధ్వర్యంలో, గుడిపల్లి నిరంజన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి మహేందర్ నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ వంకేశం నిరంజన్ ప్రారంభించి,మహేందర్ నాథ్ సమాజానికి అందించిన సేవలను కొనియాడారు.అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ,నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ,మహేందర్ నాథ్ వ్యక్తి వికాసం కోసం కాకుండా వ్యవస్థ వికాసం కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని పేర్కొన్నారు.వ్యక్తి బాగుపడితే కుటుంబం బాగుపడుతుంది..కానీ వ్యవస్థ బాగుపడితే సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుంది” అనే సిద్ధాంతంతో ఆయన పనిచేశారని తెలిపారు.బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, వందల ఎకరాల భూములను పేదలకు పంచి పెట్టిన ఘనత మహేందర్ నాథ్‌కే దక్కిందన్నారు.మాట ఇస్తే ఆ మాటకు కట్టుబడి ఎంతటికైనా పోరాడే తత్వం కలిగిన మహాపురుషుడు మహేందర్ నాథ్ అని కొనియాడారు.విద్య ద్వారానే సమాజంలో చైతన్యం సాధ్యమనే భావనతో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి,పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించిన గొప్ప దాతగా ఆయనను గుర్తు చేసుకున్నారు.ఇంతటి మహానుభావుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొంటూ,నాగర్‌కర్నూల్ జిల్లాకు పుట్టపాగ మహేందర్ నాథ్ పేరు పెట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహేందర్ నాథ్ అభిమానులు,వంకేశ్వరం లక్ష్మయ్య వంకేశ్వరం మన్నెమ్మ డాక్టర్ రమేష్ చంద్ర యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ బాలరాజు శిష్యులు,వార్డెన్ చెన్నయ్య,జెట్టి ధర్మరాజు,కొత్త శ్రీనివాసులు,మహేందర్ నాథ్ సంఘం సభ్యులు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోడేర్ మండల రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు.

**విత్తనాల కొనుగోలు బిల్లు తీసుకోవాలి**

**వ్యవసాయ విస్తరణ అధికారి సూర్యతేజ**



కోడేరు:--- (మెట్రో న్యూస్:జూన్ 10) కోడేర్ మండలం మైలారం వ్యవసాయ అధికారి తేజ మైలారం రైతు వేదికలో సమావేశం నిర్వహించి పంటలు సాగు చేసే విధానం వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో ఈ వానాకాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం అవకాశం ఉంది.జూన్‌లో వర్షాలు ఆలస్యమయ్యే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా తగినంత వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేయాలని రైతులకు సూచించారు.తొందరపడి విత్తనాలు వేయవద్దని, స్వల్ప కాలిక, కరువు తట్టుకునే పంట రకాలను ఎంపిక చేసుకోవాలని, వరి రైతులు నర్సరీలను దశలవారీగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని,అలసంద,పెసర,మినుము,కంది వంటి పప్పుధాన్య పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.నేలలో అందుబాటులో ఉన్న తేమను సమర్థవంతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.ధృవీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. .అలాగే పచ్చి రొట్ట ఎరువులు 50% సబ్సిడీతో జిలుగు లభిస్తుంది అని అన్నారు. వివరాలకు సూర్యతేజ వ్యవసాయ విస్తరణ అధికారి, మైలారం క్లస్టర్ మైలారం, రాజాపూర్ వారిని సంప్రదించండి.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా,మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ భారీ ధర్నా.




మహబూబ్‌నగర్, జూన్ 10 (మెట్రో న్యూస్): టీపీసీసీ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహించారు.జిల్లా కేంద్రంలోని బస్‌స్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ అశోక్ థియేటర్ చౌరస్తాలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, సీబీఎస్ఈ నిర్వహణలో వైఫల్యాలు, రూపాయి విలువ పతనం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వవిప్,మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్,రెడ్డి,మహబూబ్‌నగర్ నగర మేయర్ గుమాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్,యాదవ్,పాల్గొన్నారు.అలాగే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ ప్రధాన కార్యదర్శులు బుద్దారం సుధాకర్ రెడ్డి, రాములు యాదవ్, సాయిబాబా, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చందు యాదవ్, బాసిత్, లీడర్ రఘు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జిల్లా మరియు పట్టణ కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి సహకరించాలి

జోగులాంబ గద్వాల, జూన్ 10(మెట్రో న్యూస్) : ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. బుధవారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినందున రాజకీయ పార్టీల నేతలు తమ వంతుగా సహాయ, సహకారాలు అందించాలని కోరారు. మృతి చెందిన ఓటర్లను, బోగస్ ఓటర్లను జాబితా నుంచి తొలగించడమే కాక అర్హులైన ఓటర్లందరూ ఎలక్ట్రోరోల్ ఓటరు జాబితాలో ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియను



చేపట్టడం జరుగుతోందన్నారు. ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు తమ వంతుగా సహకారం అందించాలన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి జూలై 24 వరకు బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి తిరిగి ఓటర్ల వివరాలను సేకరించడం జరుగుతుందన్నారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి, సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అపరిచితులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-సంగారెడ్డి పట్టణ వలయాధికారి రాము నాయుడు**



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:సంగారెడ్డి పట్టణ మున్సిపాలిటీ 34 వార్డ్ లో బుధవారం స్థానిక కౌన్సిలర్ సమ్రిన్ బేగం అధ్యక్షతన జరిగిన వార్డ్ సభలో పాల్గొన్న సంగారెడ్డి పట్టణ సిఐ రాము నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు నిబంధనలు పాటిస్తూ ఇతరులకు హాని కలుగ కుండా మెరుగైన సమాజం కోసం కృషి చేయాలని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, టీనేజ్ యువత మత్తు పదార్థాలను బానిస కాకుండా తల్లిదండ్రులు నిఘావుంచాలని, దొంగతనాలు జరుగకుండా ప్రజలు పోలీస్ వారి సూచనలు పాటించి దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు యువత బహిరంగ ప్రదేశాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమనకి మున్సిపల్ వార్డ్ ఆఫీసర్, స్థానిక నాయకులు అన్వార్, శ్రీధర్ మహేంద్ర, మహిళా సంఘం సభ్యులు విజయ, జ్యోతి, మెప్మా ఆర్పి శోభా, బిఎల్ఓలు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొని వివిధ ప్రభుత్వ పథకాల గురించి వార్డ్ సభకు హాజరైన ప్రజలకు అవగాహన కల్పిస్తూ 34వ వార్డ్ ప్రజల నుండి వచ్చిన వివిధ ఫిర్యాదు దరఖాస్తులను స్వీకరించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

మెట్రో న్యూస్ రాయికోడ్:మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం లబ్ధిదారులకు పదకొండు లక్షల పందొమిది వేల రూపాయల,32 చెక్కల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డిసియంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్,శ్రీ వీరభద్రేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కుల్కర్ణీ ప్రభాకర్ రావు,ఏయంసి వైస్ చైర్మన్ వినయ్ కుమార్,మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు బి.నర్సిములు, రాయికోడ్ ఏయంసి మాజీ చైర్మన్లు కేదార్ నాథ్ పాటిల్,ఏసయ్యలు పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆపన్న హస్తం సియంఆర్ఎఫ్ అని,అత్యవసర పరిస్థితుల్లో ఆనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రిలో డబ్బులు పెట్టి చికిత్స చేసుకుంటే,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో ఆర్థిక కష్టాల్లో ఉన్న ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నామనీ అన్నారు.కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైన టీజీఐఐసీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

**-ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి,**

**హాజరైన ఎండి శశాంక**

మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా సంబరాలకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ... నిరంతరం విధుల్లో బిజీగా ఉండే ఉద్యోగులకు ఈ క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని చెప్పారు. క్రీడల ప్రధాన ఉద్దేశం కేవలం గెలవడం మాత్రమే కాదని, అందరూ కలిసికట్టుగా పాల్గొనడమే అసలైన విజయమని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగుల మధ్య ఐక్యత పెంచడానికి, స్నేహభావం చాటడానికి ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందించడానికి ఈ పోటీలు తోడ్పడతాయని వివరించారు. క్రీడాకారులందరూ జట్టు స్ఫూర్తితో ఆడాలని సూచించారు. ఈ క్రీడా




వేడుకల్లో భాగంగా సంస్థకు చెందిన పురుష, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. రెండు రోజుల పాటు సాగే ఈ మీట్‌లో అథ్లెటిక్స్, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ లెమన్ స్పూన్, స్విమ్మింగ్ వంటి పలు రకాల పోటీలలో పాటు చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిఈఓ రోహిణిను కలిసిన తోపాజి అనంత కిషన్



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చిన విద్యాశాఖ అధికారిణి రోహిణి ను బుధవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఆర్యవైశ్య, మా ఇల్లు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోహిణిను తెలంగాణ రాష్ట్ర మహాసభ ప్రధాన కార్యదర్శి, వాసవి మాత ఆలయ కమిటీ చైర్మన్ తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, సంఘం ప్రధాన కార్యదర్శి నామా భాస్కర్ గుప్తా, సంఘం కార్యనిర్వక కార్యదర్శి, జిల్లా పరిశ్రమల శాఖ సూపరిండెంట్ ఇరుకుల ప్రదీప్ గుప్తా పాల్గొని మర్యాదపూర్వకంగా పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యాశాఖను మరింత బలోపేతం చేయాలని కోరారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం చేసిన ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్

- కేవలం పరామర్శించడం కాదు, బాధిత కుటుంబానికి అండగా నిలవాలి



ఆర్మూర్, జూన్ 10 ( మెట్రో న్యూస్ )ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో బాధిత రాజమల్లు కుటుంబాన్ని ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల రాజమల్లు ఇల్లు దగ్ధమైన విషయాన్ని తెలుసుకున్న ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ ఈరోజు ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ.... ఎంతో కలిసి మెలిసి ఉండే గ్రామాల్లో ఇటువంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. గ్రామాల్లో కులమతాలకు అతీతంగా మనిషి మనిషికి గౌరవం ఇచ్చుకోవాలన్నారు. ఈ కుటుంబ సభ్యుల ఇంటిపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు వచ్చి పరామర్శించడం కాదు తమకు తోచిన విధంగా వారికి అండగా

# రామకృష్ణాపూర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు









## గంజాయి రహిత సమాజమే లక్ష్యం
## రామకృష్ణాపూర్ ఎస్సై జాడి శ్రీధర్

మెట్రో న్యూస్, రామకృష్ణాపూర్ :జూన్ 10/2026. రామగుండం సీపీ, డీసీపీల ఆదేశాల మేరకు రామకృష్ణాపూర్ పరిధిలో పోలీసులు గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.
గంజాయి సేవించేవారు, విక్రయించేవారిపై వచ్చిన ముందస్తు సమాచారం ఆధారంగా అనుమానితుల ఇళ్లలో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రత్యేకంగా నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. ఈ డాగ్ స్క్వాడ్ సహాయంతో ఎక్కడైనా గంజాయి దాచి ఉంచితే సులభంగా పసిగట్టవచ్చని పట్టణ ఎస్ ఐ శ్రీధర్ తెలిపారు. రామకృష్ణాపూర్ పరిధిలో ఎవరికైనా గంజాయి తాగే అలవాటు ఉన్నా, లేదా విక్రయించే అలవాటు ఉన్నా తక్షణమే మానుకోవాలని, లేనిపక్షంలో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు.
తెలంగాణ ప్రభుత్వం గంజాయి మహమ్మారిని పూర్తిగా అరికట్టడానికి ఈగల్ అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందని, ఈ బృందం నిరంతరం నిఘా ఉంచుతూ గంజాయి రహిత సమాజం కోసం కృషి చేస్తోందని ఎస్.ఐ పేర్కొన్నారు. మన ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవించడానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రామకృష్ణాపూర్ పోలీసులు ప్రజలను కోరారు.

# గ్రామ సభలో హెల్మెట్ లను అందజేసిన కలెక్టర్






కామారెడ్డి జూన్ 10 (మెట్రో న్యూస్)గ్రామ సభలో హెల్మెట్ లను అందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అడిషనల్ ఎస్పీ నర్సింహా రెడ్డి బిక్నూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం బిక్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలు తీరును గ్రామస్థులతో కలిసి సమీక్షించారు. గ్రామ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నాలుగు దఫాలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న పూరి గుడిసెలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 10 పూరి గుడిసెలను గుర్తించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారిని ఓటరు జాబితాలో నమోదు చేయడం, డబుల్ ఓటర్ల పేర్లను తొలగించడం జరుగుతోందని పేర్కొన్నారు. జన సంరక్షణ ఉ మన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 36 వేల కందకాలను తవ్వడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
అదేవిధంగా, రైతులకు ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కల్పించి, పంట విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి, ప్రతి ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహా రెడ్డి, అదనపు కలెక్టట్ ఎం.వి గిరి, గ్రామ సర్పంచ్ రేఖ, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్పీ



కామారెడ్డి జూన్ 10 (మెట్రో న్యూస్)గాంధారి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కురుపాటి రఘు కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా ఎస్పీకామారెడ్డి జిల్లా గాంధారి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ కురుపాటి రఘు గుండెపోటుతో మంగళవారం ఆకస్మికంగా మరణించడం పట్ల జిల్లా పోలీసు శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, బుధవారం బాన్సువాడలోని మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రఘు భార్య రజిని, కుమార్తెలు రసజ్ఞ, అమూల్య, తల్లి చంద్రకళ ను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ కురుపాటి రఘు విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే పోలీస్ సిబ్బందిలో ఒకరని పేర్కొన్నారు. ఆయన మరణంతో పోలీస్ శాఖ ఒక మంచి కానిస్టేబుల్‌ను, కర్తవ్యనిరతిగల సహచరుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రఘు కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మనోధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించారు. రఘు సేవలను స్మరించుకుంటూ జిల్లా పోలీసు శాఖ తరఫున ఘన నివాళులు అర్పించిన ఎస్పీ, ఆయన అంకితభావం, సేవా తపన పోలీస్ శాఖలో చిరస్థాయిగా గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. .ఈ కార్యక్రమంలో బాన్సువాడ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్, బాన్సువాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ మహేందర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత





-పూడికతీత చేపట్టి నిజాంసాగర్, శ్రీరాంసాగర్ నీటి నిలువ సామర్థ్యం పెంచుతాం
-కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు
-మేడిగడ్డ పునరుద్ధరణకు కృషి
-రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
-జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలకు ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి
-సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన

నిజామాబాద్, జూన్ 10 ( మెట్రోన్యూస్ )ఉత్తర తెలంగాణ జిల్లాలలోని సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ కు సంబంధించిన వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. 106 కోట్ల రూపాయల వ్యయంతో 7,975 ఎకరాల ఆయకట్టుకు నీరందించే జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. హెలికాప్టర్ లో సిద్దాపూర్ చేరుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కర్, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ తదితరులు హెలిప్యాడ్ వద్ద పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాకోరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి, పౌర సరఫరాలకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తోందని గుర్తు చేశారు. భూసేకరణ, అటవీ అనుమతులు, ఆర్ అండ్ ఆర్ తదితర వాటి కోసం ప్రభుత్వం రూ. 5వేల కోట్లు కేటాయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇందులో భాగంగానే లోయర్ మానేరు, మిడ్ మానేరు డ్యామ్ లు, కడెం ప్రాజెక్టులలో నీటి నిల్వ సామర్థ్యం పెంపొందించేందుకు పూడికతీత చేపడుతున్నామని తెలిపారు. అదే తరహాలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్, ఉత్తర తెలంగాణ జిల్లాలకు అత్యంత కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో కూడా పూడికతీత చేపట్టి రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంపొందిస్తామని ప్రకటించారు. కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి లోపభూయిష్ట నిర్మాణం, డిజైన్ల వల్ల కొన్నాళ్ళకే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆక్షేపించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని, అయినప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో కట్టిన మేడిగడ్డ బ్యారేజి కొన్ని రోజులకే కూలిపోవడం జరిగిందని, కానీ నిజాం నవాబు నిర్మించిన నిజాంసాగర్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిన శ్రీరాంసాగర్, నాగార్జున సాగర్, జూరాల ప్రాజెక్టులు మాత్రం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఎంతో గట్టిగా నిలబడి ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. కాగా, సిద్దాపూర్ రిజర్వాయర్ పనుల పూర్తి కోసం సవరించిన ప్రతిపాదనల మేరకు అవసరమైన నిధులను తప్పక కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతాంగ ప్రయోజనాలు కాపాడడమే పరమావధిగా తమ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని 295 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. అందులో ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాల ద్వారా 145 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, 48గంటల లోపే రైతుల ఖాతాలలో బిల్లులు జమ చేస్తూ రూ. 35 వేల కోట్లు చెల్లించామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 5లక్షల కుటుంబాలలోని 3.25 కోట్ల మందికి ఒక్కొక్కరికి ప్రతీ నెల ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు, స్థానిక శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా తన నియోజకవర్గంలో జాకోరా, చందూర్ ఎత్తిపోతల పోతకాలను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో బాన్సువాడ నియోజకవర్గ రైతులు పంటలు సాగు చేస్తూ, అధిక దిగుబడులు సాధిస్తున్నారని అన్నారు. మొత్తం లక్షా 48 వేల ఎకరాలలో పంటలు పండిస్తున్నారని, 95వేల ఎకరాల ఆయకట్టుకు నిజాంసాగర్ నీరు సమకూరుతోందని తెలిపారు. 30 వేల ఎకరాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు జలాలు అందిస్తున్నామని, నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో లేని మిగతా భూములకు కూడా సాగు జలాలు అందించాలనే కృత నిశ్చయంతో సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ రావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్, సీ.ఈ శ్రీదేవి, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, తహసిల్దార్ ప్రశాంత్, సర్పంచ్ సాయిలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# గులాబీ జండా ఎగరాలి :తలసాని

**గోషామహల్ (మెట్రో న్యూస్ ):** వచ్చే ఎన్నికలలో గోషామహల్ నియోజకవర్గం పై గులాబీ జెండా ఎగరాలని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీమంత్రి, అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమం గోషామహల్ నియోజకవర్గ ఇంచార్జి నాగేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో పైరవీలకు తావు లేదని, కష్టపడి పనిచేస్తూ ప్రజాదరణ ఉన్న వారికే సముచిత స్థానం, గౌరవం లభిస్తాయని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వం లోని తెలంగాణ ప్రభుత్వంలో గోషామహల్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, 10 కోట్ల రూపాయల వ్యయంతో ఫిష్ మార్కెట్ నిర్మాణం, నాలా నిర్మాణం, డ్రైనేజీ సమస్యల పరిష్కారం వంటి అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 24 వ తేదీ నుండి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అక్రమంగా ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. ఈ సారి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డిజిటల్ విధానములో చేపడుతున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా ఇంటింటికి వెళ్ళి సభ్యత్వ నమోదు చేపట్టాలని వివరించారు. అదేవిధంగా ఇంటింటికీ వెళ్ళిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రెండున్నరేళ్లు అవుతున్నా అమలు చేయకుండా చేసిన మోసం గురించి కూడా వివరించాలని చెప్పారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గోషామహల్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ ఇంచార్జి ఆర్వీ మహేందర్ కుమార్, సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్లతో పాటు పలువురు నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.




## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**మెట్రో న్యూస్ ఎల్ బి నగర్:** సీ.ఎం.రిలీఫ్ ఫండ్తో పేదలకు అండగా నిలుస్తున్నాం:ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ నందు నివాసం ఉంటున్న మీణు గారు మెదడుకు సంబంధించి పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో వారి కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుదీర్ రెడ్డి గారిని సంప్రదించారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి వారి వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు. దీనికి సంబంధించి నాలుగు లక్షల రూపాయల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా మాకు ఎంతో సంతృప్తి లభిస్తుంది. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎంతోమంది పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది" అని పేర్కొన్నారు.బాధిత తండ్రి కాశీనాథ్ గౌడ్ మాట్లాడుతూ మా కుతురు ఆరోగ్య సమస్య విషయంలో సుదీర్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందని, ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు మహేష్ రెడ్డి,అనిల్ యాదవ్,అంజయ్య గౌడ్,మధుసూదన్,మనీష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు



**మెట్రో న్యూస్ ప్రతినిధి శేరిలింగంపల్లి /కలెక్టరేట్ :** రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోడౌన్‌ను రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గోడౌన్ లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు (లు), కంట్రోల్ యూనిట్లు (లు), వీవీప్యాట్ యంత్రాలు (లు) మరియు ఎన్నికల సామగ్రి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈవీఎం ల నిర్వహణ, భద్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, సంరక్షణ, నిర్వహణలో నిర్దేశిత విధానాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.తదనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించి, వారి సమక్షంలోనే గోడౌన్‌కు సీల్ వేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహసీల్దార్, ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి శ్రీ బొమ్మ రాములు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్జీకే చిరు వ్యాపారుల షాపులు తొలగించవద్దు

### - ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాలు



**కుత్బుల్లాపూర్, జూన్ 10 (మెట్రో న్యూస్ ప్రతినిధి):** జగద్గిరిగుట్ట డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సముదాయంలో జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపులను తొలగించవద్దని కోరుతూ ఆర్జీకే సంక్షేమ సంఘం నాయకులు, వ్యాపారులు బుధవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్‌తో పాటు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్జీకే సముదాయంలో గత 18 ఏళ్లుగా సుమారు 1,779 కుటుంబాలు, దాదాపు 7 వేల మంది జనాభా నివసిస్తున్నప్పటికీ స్థానికంగా ఎలాంటి షాపింగ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలు జీవనోపాధి కోసం గత 18 సంవత్సరాలనుండి చిన్నచిన్న షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.అయితే ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు మూడు రోజుల్లోగా స్వచ్ఛందంగా షాపులను తొలగించుకోవాలని, లేనిపక్షంలో జేసీబీల సహాయంతో తొలగిస్తామని హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా షాపులను తొలగిస్తే వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.కాబట్టి తమ జీవనాధారమైన షాపులను తొలగించకుండా యథావిధిగా వ్యాపారాలు కొనసాగించుకునే అవకాశం కల్పించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే, అధికారులను కోరినట్లు తెలిపారు.

## రెండు పడకగదుల కాలనీలలో అవకతవకలను గుర్తించండి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (మెట్రో న్యూస్ ):** మేడ్చల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మంచి లే అవుట్లు, అన్నిరకాల మౌలిక వసతులతో నిర్మించి మంజూరు చేసిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో లబ్ధిదారులు అందరూ నివసించేలా చూడాలని, ఇండ్లు కేటాయించినా ఈ కాలనీల్లోకి షిఫ్ట్ కాని వారందరికీ మరోసారి నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి మరియు హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి వి.పి.గౌతం అధికారులను ఆదేశించారు. వివిధ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె కాలనీల్లోని పనులన్నిటినీ త్వరతగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తో కలిసి పలు 2 బిహెచ్ కె కాలనీల్లో పర్యటించి పనుల పురోగతిని సమీక్షించారు. బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ లోని 2 బిహెచ్ కె కాలనీల్లో పర్యటిస్తూ ఆయా కాలనీల్లో నివసిస్తున్న వారితో మాట్లాడారు. గండిమైసమ్మ ప్రాంతంలో అధికారులు నిర్వహిస్తున్న సర్వేను అధికార బృందం పర్యవేక్షించింది. సర్వే వివరాలను సమగ్రంగా, యాప్‌లో అప్ లోడ్ చేస్తున్నారా లేదా, అర్హతల నిర్ధారణ ప్రక్రియ తదితర అంశాలను గమనించి, సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే అనంతరం, యుద్ధప్రాతిపదికన ముందుగా 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారుల ఎంపికను చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరికి, ప్రత్యేక కార్యదర్శి సూచించారు. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్య కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి.రమణారెడ్డి, జిల్లా హౌసింగ్ పిడి రమణమూర్తి, ఇంజనీర్లు పి.వి.రవీందర్ తోపాటు, స్థానిక రెవెన్యూ, వాటర్ వర్క్స్,విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి



**మెట్రో న్యూస్ షాద్ నగర్:** తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని స్థానిక ఉద్యమ కారుల ఆధ్వర్యంలో బుధవారం షాద్ నగర్ బ్లాక్ ఆఫీస్ ముందు ప్రొఫెసర్ జయ శంకర్ గారి విగ్రహం వద్ద విడుదల చేసిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇటి స్థలం పింఛన్ గుర్తింపు కార్డు ఇవ్వాలని ప్రధాన డిమాండ్ తో జూన్ 21న ఇందిరాపార్క్ హైదరాబాదులో ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శతాబ్ద కాలంలో అతిపెద్ద ఉద్యమం జరిగింది అంటే అది కేవలం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మాత్రమే, అంత పెద్ద ఉద్యమానికి నాయకత్వం వహించిన తెలంగాణ ఉద్యమ వీరులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం. అదేవిధంగా ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఘనమైన నివాళులు అర్పిస్తున్నాం.తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో స్వరాష్ట్రం కోసం ప్రాణాలు తిరిగించి ఉద్యమించిన ఉద్యమకారులందరినీ గౌరవించుకోవడానికి తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం దక్కలేదు ఏదో కొంతమందికి చిన్న చిన్న పదవులు ఇచ్చిన ముఖం చాటేశారు. తప్ప తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన విద్యార్థి ఉద్యమ నాయకులకు కార్మికులకు తగిన ఫలాలు దక్కలేదు అలాంటి సందర్భంలో ప్రజా ప్రభుత్వం పాలనలోకి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను గుర్తించాలని కేశవరావు ఆధ్వర్యంలో కమిటీ వేసి గుర్తింపు చర్యలు చేపట్టడం జరిగింది ఈ చర్యను తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆహ్వానిస్తుంది. అదే సమయంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది ఉద్యమకారుల పైన పోలీసు కేసు కాకపోవడం వల్ల ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అందరికీ ఉద్యమకారులకు ఇవ్వవలసిన దక్కవలసిన ఫలాలు దక్కకుండా పోతావేమో అనే అపోహములో అందరమూ ఉన్నాము,ఇలాంటి అపోహల ఉన్న సందర్భంలో ఉద్యమకారులు అంత సంఘటితమై వారి హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైనది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి వెంకట్ రాంరెడ్డి, కౌన్సిలర్ దిలీప్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ మాంగులాల్ నాయక్, విద్యార్థి నేత జాంగారి రవి, ఉద్యమ కారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మేకల వెంకటేష్, రవి కుమార్ గౌడ్,బి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, రహీమ్,నేతలు కుడుముల మల్లేష్, ప్రసాద్, సిందం విటలయ్య,శేఖర్ గౌడ్, సింగపాగ శివ, సమెల్, రామకృష్ణ, చింటు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీని కలిసిన జర్నలిస్టులు

### - జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినందుకు కృతజ్ఞత



మెట్రో న్యూస్ ప్రతినిధి, శేరిలింగంపల్లి : తెలంగాణ పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని బుధవారం శేరిలింగంపల్లి జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వివేకానందనగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో అరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినందుకు ఎమ్మెల్యే గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. చందానగర్ లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన ఒక ఎకరం స్థలానికి సర్వే నిర్వహించాలని తహసీల్దార్ కు ఫోన్ చేసి సూచించారు. ఈ భూమి పక్కనే ఉన్న మరో ఎకరా స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గతంలో సబ్ స్టేషన్ కోసం కేటాయించిన సదరు స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాన్ని దృష్టిలో ఉంచుకొని సబ్ స్టేషన్ ను మరో ప్రాంతానికి బదిలీ చేయించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గాంధీని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పైళ్ల విట్టల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి, జర్నలిస్టు నాయకులు శ్రీనివాస్ గౌడ్, అశోక్ యాదవ్,అమృత్ గౌడ్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు గౌడుగు శ్రీనివాస్, టెంజు అధ్యక్షుడు పి.సాగర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.కిషోర్ కుమార్, జర్నలిస్టులు దేవేందర్ తదితరులు ఉన్నారు.

# అన్ని అవినీతి అక్రమాలు చేయబడును


**ముఖ్య గమనిక : అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను సస్పెండ్ చేయడం, బదిలీ చేయడం ఇక్కడ జరగదు.**
**ఎల్.బి.నగర్ జోనల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇటీవల మెట్రో దిన పత్రిక వరుస కథనాలు ప్రచురించడం జరుగుతుంది. ఎల్.బి.నగర్ జోనల్ టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో జరుగుతున్న, జరిగిన అవినీతి, అక్రమాల్లో భాగంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న జోనల్ సి.పి. శ్రీనివాస్ యాదవ్ మరో భాగోతం.**

మెట్రో న్యూస్ ఎల్బినగర్ : ఛలో ఎల్.బి.నగర్ జోనల్ కార్యాలయం. ఇక్కడ అన్ని అవినీతి, అక్రమాలు చేయబడును. ఎల్.బి.నగర్ జోనల్ పరిధిలోని సరూర్ నగర్ రెవిన్యూ మండలం పరిధిలోని సర్వే నెంబర్ 32 లో నిర్మాణ దారుడు ప్రభుత్వం నుండి డొమెస్టిక్ తో కూడిన ఒక అంతస్తుకు అనుమతులు తీసుకొని నిర్మాణం పూర్తి చేసారు. అనంతరం ఓ.సి.కి దరఖాస్తు చేసుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఓ.సి. దరఖాస్తును పరిశీలించి ఓ.సి. జారీ చేసారు.కట్ చేస్తే, ప్లాన్ ప్రకారం డొమెస్టిక్ నిర్మాణం పూర్తి చేసి ఇప్పుడు ప్రిస్టిన్ హెల్త్ కేర్ గోదాం పేరుతో కమర్షియల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. సంబంధిత భవన యజమానులు ఈ గోదాం పై ఓ దిన పత్రికలో జనవరి నెలలో వార్త కథనం ప్రచురించడం జరిగింది. ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన ఓ.సి.లో జోనల్ సి.పి. శ్రీనివాస్ యాదవ్ పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అందుకు పలు ఉదాహరణలు కూడా ఉన్నాయి.ఇలా ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కి, ప్రభుత్వ చట్టాలకు తూట్లు పొడుస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ, ధనార్జనే ధ్యేయంగా భావించి, అక్రమార్కులతో చేతులు కలిపి, వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్న వైనం మనకు స్పష్టంగా కనిపిస్తుంది.బాహుబలి సినిమా గురించి మనకు పెద్దగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. అందులో కటప్ప పాత్ర మాదిరి మన ఎల్.బి.నగర్ జోన్ లో సి.పి.గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ యాదవ్ గట్టిగా ప్రభుత్వానికి వెన్నుపోటు పొడుస్తున్న వైనం స్పష్టంగా మనకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది.ఎల్.బి.నగర్ జోనల్ సి.పి. అవినీతి చక్రవర్తి కహానీ పార్ట్ 2 లో వాస్తవాలను వెలుగులోకి తేవడం జరిగింది. సి.పి. గారి అవినీతి చిట్టా, చరిత్ర మెట్రో దిన పత్రిక ద్వారా ప్రజలకు తెలియజేయడం జరుగుతుంది.ముడుపులు ఇచ్చుకో, ఓ.సి. పుచ్చుకో శీర్షికతో ప్రజలు వాస్తవాలను తెలుసుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, తమ వంతు బాధ్యతగా సంబంధిత అధికారుల అవినీతి ఆగడాలను, సామాజిక కార్యకర్తలు, ప్రశ్నించే గొంతుకలు ప్రభుత్వానికి తమ స్వరం వినిపించి, అవినీతి అక్రమాలను అడ్డుకొని, అవినీతి అక్రమాలకు తావు లేని రాష్ట్రంగా స్థానిక ప్రజలు సైతం భాగస్వామ్యం కావాలని మెట్రో దిన పత్రిక కోరుకుంటున్నది.ముఖ్య గమనికలోని సారాంశం ఏమిటంటే, ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను బదిలీ చేయడం, సస్పెండ్ చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.జి.హెచ్.ఎం.సి. పరిధిలోని






బడంగ్పేట్ సర్కిల్లో విధులు నిర్వహిస్తున్న క్రింది స్థాయి ఉద్యోగుల నుండి కమిషనర్ వరకు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు రావడంతో జి.హెచ్.ఎం.సి. కమిషనర్ విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించడం జరిగింది. అనంతరం అవినీతి అక్ర మాలు అధికారులు గుర్తించి సంబంధిత సిబ్బంది, కమిషనర్ ను సస్పెం డ్ చేయడం మనం సామాజిక మాధ్యమాల్లో, పలు దిన పత్రికలలో చూసాం.ఇక్కడ సి.పి. శ్రీనివాస్ యాదవ్ పై ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణ చేపడితే అవినీతి అక్రమాల చిట్టా బయట పడుతుంది. సి.పి. గారి అవినీతి అక్రమాలపై మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శాఖాపరమైన చర్యలు తీసుకుంటాడా? టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి అక్రమాలు షరా మామూలే అని లైట్ తీసుకుంటారా? ఇది కూడా మరుగున పడే అంశంగా మారుతుందా?మరోకథనంతోమీ ముందుకు.









ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల కుటుంబాలు ఎంతగానో ఎదురుచూస్తున్న 'తల్లికి వందనం' పథకం నిధుల విడుదలపై ప్రభుత్వం కీలక కసరత్తు చేస్తోంది. సాధారణంగా గత ఏడాది జూన్ 12వ తేదీనే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ. 13,000 చొప్పున నగదును సర్కార్ జమ చేసింది.

## ప్రధానిగా మోదీ రికార్డ్ చంద్రబాబు, నారా లోకేశ్ ప్రత్యేక శుభాకాంక్షలు!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్లు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. సుదీర్ఘకాలం పాటు దేశ ప్రధానిగా సేవలందిస్తూ అత్యున్నత చారిత్రక మైలురాయిని అందుకున్న సందర్భంగా.. ఏపీ ప్రజల తరఫున ప్రధానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. కేవలం దేశాన్ని పాలించడమే కాకుండా, దాని గతిని మార్చే అరుదైన దార్శనికత కలిగిన నేత మోదీ అని వారు కొనియాడారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రయాణంలో ప్రతి స్థాయిలో భారతదేశాన్ని మార్చడానికి విశేషంగా కృషి చేశారని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సామాన్యుడి కనీస అవసరాల నుండి గ్లోబల్ లీడర్‌షిప్ వరకు ప్రతి అంశంలోనూ మోదీ ముద్ర స్పష్టంగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. "ఇంట్లోని సామాన్యుడి మంచినీటి కుళాయి (జల్ జీవన్ మిషన్) నుండి అంతరిక్షంలో చంద్రయాన్ విజయం వరకు.. పొలంలోని రైతు ఆకాంక్షల నుండి సరిహద్దులోని సైనికుడి ధైర్యం వరకు.. ప్రగతి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా మోదీ దార్శనికతతో పాలన సాగించారు" అని చంద్రబాబు ప్రశంసించారు. దేశంలోని బలహీన వర్గాలకు సంక్షేమ పథకాల ద్వారా మద్దతిస్తూనే, మరోవైపు కఠినమైన ఆర్థిక సంస్కరణలతో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేయడం మోదీ పాలనలోని ప్రత్యేకత అని కొనియాడారు. మోదీజీ దార్శనికత అయిన 'వికసిత భారత్'కు అనుగుణంగానే, తాము నవ్యాంధ్రను 'స్వర్ణాంధ్ర'గా నిర్మించేందుకు కట్టుబడి ఉన్నామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## దేశవ్యాప్తంగా రేషన్ బియ్యం బస్తాలకు క్యూఆర్ కోడ్ విధానం




దేశవ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ ద్వారా సరఫరా చేసే బియ్యం బస్తాలకు ఇకపై క్యూఆర్ కోడ్ విధానాన్ని అనుసంధానించనున్నట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారికంగా ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పైలట్ ప్రాజెక్ట్ అద్భుతమైన ఫలితాలను ఇవ్వడంతోనే, దీనిని దేశవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సరికొత్త టెక్నాలజీ వల్ల రేషన్ బియ్యం సరఫరాలో పారదర్శకత పెరగడమే కాకుండా, అక్రమ రవాణాకు శాశ్వతంగా అడ్డుకట్ట పడుతుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

తిరుపతిలో కేంద్ర మంత్రి ప్రకటన.. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రశంసలు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి ఈ కీలక వివరాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం ఈ సాంకేతికతను పర్యవేక్షిస్తున్న తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌లో క్యూఆర్ కోడ్ అమలు చేయడం వల్ల బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయని, మిల్లింగ్ కేంద్రం నుండి పేద లబ్ధిదారుడి చేతికి చేరే వరకు ప్రతి దశను డిజిటల్ పద్ధతిలో నిశితంగా పర్యవేక్షించే వీలు కలిగిందని ఆయన వివరించారు.




## బాలకృష్ణకు సీఎం చంద్రబాబు, లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు

అమరావతి, జూన్ 10: ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా బాలయ్యకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. బాలకృష్ణకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐదు దశాబ్దాలుగా సినీ వినీలాకాశంలో ధ్రువతారగా బాలయ్య వెలుగొందుతున్నారని సీఎం అన్నారు.

భోళాతనానికి ప్రతిరూపమైన బాలా మామయ్యకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'సినీ, రాజకీయ, సేవా రంగాలలో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ అజేయంగా ముందుకు వెళుతున్న పద్మభూషణుడు, హిందూపురం శాసనసభ్యుడు, నా ఆప్తుడు నటసింహం నందమూరి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు. ఐదు దశాబ్దాలుగా సినీ వినీలాకాశంలో ధ్రువతారగా వెలుగొందుతూ, మాతృమూర్తి పేరుతో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్‌గా అశేష జనానికి ఆపన్నహస్తం అందిస్తూ, హిందూపురం ప్రజలకు అండగా నిలుస్తూ మీరు సాగిస్తున్న జీవనయానం నిరంతరంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను. ఆ భగవంతుడు మీకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. నవరస నటనా సార్వభౌముడు, తెలుగువారి అన్న నందమూరి తారక రామారావు దివ్య ఆశీస్సులు మీపై కలకాలం ఉండాలని కోరుకుంటూ మరొక్క మారు జన్మదిన శుభాకాంక్షలు' అంటూ సీఎం పోస్ట్ చేశారు.

## భారతీరాజా మృతికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతాపం



అమరావతి, జూన్ 10: ప్రముఖ దర్శకులు భారతీరాజా మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. భారతీరాజా మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పవన్ తెలిపారు.

'ప్రముఖ దర్శకులు భారతీరాజా కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తమిళ, తెలుగు చిత్రాలపై భారతీరాజా తనదైన ముద్ర వేశారు. గ్రామీణ నేపథ్యం, పల్లె ప్రజల జీవనం, ప్రేమానుబంధాలను, టీనేజర్స్‌కు ఉండే ఆకర్షణలు లాంటివి చూపించడంలో ఆయన శైలి ప్రత్యేకమైనది. ఆయన తెలుగులో దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' ఇప్పటికీ చూడదగ్గ విధంగా ఉంటుంది. ఆ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పించాయి. అన్నయ్య చిరంజీవితో 'ఆరాధన' చిత్రం రూపొందించారు. అందులో 'అరె ఏమైంది...' అనే పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. సున్నితమైన ప్రేమ, సెంటిమెంట్ కథలే కాకుండా 'ఎర్ర గులాబీలు', 'టిక్ టిక్ టిక్' లాంటి థ్రిల్లర్స్‌తోను ప్రేక్షకులను మెప్పించారు. అలాంటి గొప్ప సృజనాత్మక దర్శకుడిని కోల్పోవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటు. భారతీరాజా మరణం పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.



## ఏపీఎల్-2026 షురూ

ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులను అలరించేందుకు 'ఆంధ్ర ప్రీమియర్ లీగ్' ఐదో సీజన్ అట్టహాసంగా సిద్ధమైంది. విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ టోర్నమెంట్ ప్రారంభమైంది. అయితే, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న దురదృష్టకర అగ్నిప్రమాద ఘటన కారణంగా, ఎలాంటి హంగు ఆర్భాటాలు, వేడుకలు లేకుండా ఈ టోర్నీని అత్యంత నిరాడంబరంగా మొదలుపెట్టారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. టోర్నీలో భాగంగా జరిగిన మొదటి మ్యాచ్‌లోనే కాకినాడ కింగ్స్ బ్యాటర్లు పరుగుల వరద పారించారు.


GMR APL ANDHRA PREMIER LEAGUE





## భవన నిర్మాణ పర్మిషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఇళ్ల నిర్మాణ అనుమతుల ప్రక్రియపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు) ఒక చారిత్రాత్మక మార్గదర్శకత్వాన్ని ఇచ్చింది. భూమి యాజమాన్య హక్కుల (టైటిల్)కు సంబంధించిన తగాదాలు లేదా వివాదాలు ఉన్నాయనే నెపంతో గ్రామ పంచాయతీలు భవన నిర్మాణ అనుమతులను నిరాకరించడానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇలాంటి హక్కుల వివాదాలను విచారించి, పరిష్కరించే పరిధి కేవలం సివిల్ కోర్టులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. సుబ్బారెడ్డి కీలక తీర్పును వెలువరించారు.

నంద్యాల జిల్లా పిటిషన్‌పై విచారణ.. పంచాయతీ తీర్మానం రద్దు నంద్యాల జిల్లా, మహానంది మండలం పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన కె. జమాల్ రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన అనంతరం న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ జమాల్ రెడ్డి స్థల యాజమాన్యాన్ని ప్రశ్నిస్తూ ఓ థర్డ్ పార్టీ (మూడో పక్షం) పంపిన లీగల్ నోటీసును ఆధారం చేసుకుని, అతనికి భవన నిర్మాణ అనుమతిని నిరాకరిస్తూ 2023 డిసెంబర్ 24న స్థానిక గ్రామ పంచాయతీ చేసిన తీర్మానాన్ని హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది.

## ఆక్వా రైతులకు శుభవార్త



ఏపీలో కష్టాల్లో ఉన్న ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ సీఎం చంద్రబాబు ఈ సంచలన నిర్ణయానికి ఆమోదముద్ర వేశారు. జోన్‌తో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్‌ను ఇకపై రూ. 1.50లకే అందజేయనున్నారు. ఈ నిర్ణయం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం ఏటా రూ. 1100 కోట్ల భారాన్ని భరిస్తోంది.

రాష్ట్ర విభజన తర్వాత గతంలో టీడీపీ ప్రభుత్వం ఈ రాయితీ పథకాన్ని అమలు చేసింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఈ పథకం పరిమితంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ప్రభుత్వం జోన్‌ల పట్టింపు లేకుండా అందరికీ ఈ సౌకర్యం కల్పించడంతో లక్షలాది మందికి లబ్ధి చేకూరుతుంది. సాగు విస్తీర్ణంతో సంబంధం లేకుండా విద్యుత్ ఖర్చు తగ్గడం వల్ల చిన్న, సన్నకారు రైతులు సైతం ఆక్వా రంగంలో లాభాలు పొందే వీలుంది. వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ అడుగు రైతుల్లో హర్షం వ్యక్తం చేస్తోంది.


## యోగా మన జీవితంలో భాగం కావాలి: వసంత కృష్ణప్రసాద్



ఎన్టీఆర్ జిల్లా, జూన్ 10: ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద ‹యోగాంధ్ర›లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా పాల్గొన్నారు. జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్ 21న జరిగే యోగాంధ్ర విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. యోగా మన జీవితంలో భాగం కావాలన్నారు. ఒత్తిడి, షుగర్, గుండెపోటు నియంత్రణకు యోగా అవసరమని తెలిపారు. భారతీయ సంస్కృతికి యోగా ప్రతీక అని, శాక్ష్మయంగా నిరూపితమైందన్నారు. 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా' థీమ్‌తో ప్రభుత్వ కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.

జూన్ 21న అమరావతిలో భారీ యోగా వేడుకలకు సీఎం చంద్రబాబు నాయకత్వం వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రధాని మోదీ యోగాను ప్రపంచానికి పరిచయం చేశారని.. ప్రతి ఇంట్లో రోజూ అరగంట యోగా చేయాలని సూచించారు. యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. యువత చెడు అలవాట్లు వీడి యోగాను అలవర్చుకోవాలని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని వసంత కృష్ణప్రసాద్ సూచించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ బాధితులను పరామర్శించనున్న జగన్



మాజీ ముఖ్యమంత్రి మరియు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు విశాఖపట్నం పర్యటించనున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మరియు గాయపడిన కార్మికుల కుటుంబాలను ఓదార్చడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం. ప్రమాదం జరిగినప్పటి నుంచి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్న ఆయన, బాధితులకు అండగా ఉండాలని పార్టీ శ్రేణులను ఇప్పటికే ఆదేశించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్వయంగా కలిసి, వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచిస్తున్నారు.

స్టీల్ ప్లాంట్ ఘటనలో కార్మికుల మృతి పట్ల వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత విషాదకరమని, బాధిత కుటుంబాలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్మికుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూనే, వారి భవిష్యత్తు గురించి ఆందోళన చెందవద్దని ఓదార్చనున్నారు. కష్టకాలంలో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు బాధితులకు అండగా నిలవాలని, అవసరమైన అన్ని విధాలుగా సహాయం అందించాలని ఆయన స్పష్టం చేశారు.



# మామిడి టెంకతో సహజ సౌందర్యం..

మామిడి పండు తిన్న తర్వాత టెంకను చాలా మంది పనికిరాదని భావించి పారేస్తారు. అయితే మామిడి టెంకలో కూడా చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడే ఎన్నో పోషకాలు దాగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

మామిడి టెంకతో సహజ సౌందర్యం.. ఇంట్లోనే బ్యూటీ కేర్

ఇంటర్నెట్ డెస్క్: మామిడి పండ్లను ఎంతో ఇష్టంగా తింటాం. అయితే పండు తిన్న తర్వాత టెంకను పనికిరాదని భావించి చాలా మంది పారేస్తారు. కానీ మామిడి టెంకలో కూడా ఎన్నో పోషకాలు, సౌందర్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. చర్మం, జుట్టు సంరక్షణలో మామిడి టెంక ఎంతో ఉపయోగపడుతుంది.

మామిడి టెంకలో సహజ కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మానికి తేమను అందించడమే కాకుండా జుట్టును ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్‌కు బదులుగా మామిడి టెంకతో ఇంట్లోనే కొన్ని సులభమైన సౌందర్య చిట్కాలను పాటించవచ్చు.

జుట్టుకు పోషణనిచ్చే హెయిర్ ఆయిల్



మామిడి టెంకను ఎండబెట్టి పొడి చేసి కొబ్బరి లేదా నువ్వుల నూనెలో కలిపి కొంతసేపు నానబెట్టాలి. ఈ నూనెను జుట్టుకు రాస్తే పొడిబారిన జుట్టుకు పోషణ అందడంతో పాటు మెరుపు పెరుగుతుంది.

డీప్ కండిషనింగ్ హెయిర్ మాస్క్

మామిడి టెంక పొడిలో పెరుగు, కలబంద జెల్ కలిపి హెయిర్ మాస్క్ తయారు చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి అరగంట తర్వాత కడిగితే జుట్టు మృదువుగా మారుతుంది.

సహజ లిప్ బామ్

మామిడి టెంక నుంచి లభించే వెన్నలో కొద్దిగా బాదం నూనె కలిపి పెదవులకు రాస్తే పొడిబారిన, పగిలిన పెదవులకు ఉపశమనం లభిస్తుంది.

ఫేస్ స్క్రబ్

మామిడి టెంక పొడిని తేనె లేదా రోజ్‌వాటర్‌తో కలిపి ముఖానికి రుద్దితే మృతకణాలు తొలగి చర్మం మృదువుగా మారుతుంది.

హైడ్రేటింగ్ ఫేస్ ప్యాక్

మామిడి టెంక పొడిలో పెరుగు, తేనె కలిపి ఫేస్ ప్యాక్‌గా ఉపయోగిస్తే చర్మానికి తేమ అందడంతో పాటు కాంతివంతంగా కనిపిస్తుంది.

ఇకపై మామిడి పండు తిన్న తర్వాత టెంకను పారేయకుండా, ఈ సులభమైన బ్యూటీ టిప్స్‌తో చర్మం, జుట్టు సంరక్షణలో ఉపయోగించండి. ఇది సహజమైనదే కాకుండా ఖర్చు కూడా తగ్గిస్తుంది.



సెలబ్రిటీల స్కిన్ మెరుపు వెనుక సీక్రెట్ ఇదే

# మెరిసే స్కిన్ కోసం సెలబ్రిటీలు ఫాలో అయ్యే 10 సీక్రెట్స్..

ప్రముఖ పాప్ సింగర్, నటుడు నిక్ జోనాస్ తన అద్భుతమైన గాత్రంతోనే కాకుండా, యవ్వనంగా కనిపించే మెరుపుతో కూడా లక్షలాది మంది అభిమానులను ఆకట్టుకుంటున్నారు. బిజీ షూటింగ్ షెడ్యూల్స్, టూర్లలో ఉన్నప్పటికీ తన చర్మాన్ని తాజాగా, ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆయన ప్రత్యేకమైన సెల్ఫ్-కేర్ రొటీన్‌ను పాటిస్తారు. నిక్ తన రోజును ఉదయాన్నే సెలెరీ జ్యూస్‌తో ప్రారంభిస్తారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, శరీరాన్ని డిటాక్సిఫై చేయడానికి ఎంతగానో సహాయపడుతుందని నిక్‌చెబుతున్నారు.

డైలీ రొటీన్ మధ్యలో నిక్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. భార్య ప్రియాంక చోప్రాతో కలిసి కొత్త ఇంటికి మారినప్పుడు ఒక సిగ్నేచర్ సెంటర్‌ను ఎంచుకోవడం, ప్రియాంక 40వ పుట్టినరోజు సందర్భంగా అతిథులందరికీ సన్‌స్క్రీన్ అందించడం వంటివి నిక్ యొక్క ప్రేమ మరియు కేరింగ్ స్వభావాన్ని తెలియజేస్తాయి. "సెలబ్రిటీల గ్లామర్ వెనుక క్రమశిక్షణతో కూడిన సంరక్షణ ఉంటుంది" అని నిక్ జోనాస్ ఈ రొటీన్ ద్వారా నిరూపిస్తున్నారు.

నిక్ జోనాస్ పాటిస్తున్న 10 చిట్కాలు

ఐస్ వాటర్ ఫేషియల్: ఉదయాన్నే ముఖాన్ని ఐస్ వాటర్ బాత్‌లో ముంచడం వల్ల వాపు, అలసట తగ్గి, మెదడు చురుగ్గా మారుతుంది.క్లీనప్ షేవింగ్: వ్యక్తిగత ప్రాధాన్యతలను బట్టి షేవింగ్ చేసుకోవడం చర్మ సంరక్షణలో ఒక ముఖ్యమైన భాగం.క్లెన్సింగ్ జెల్: మేకప్ లేదా ఇతర మలినాలను తొలగించడానికి మంచి క్లెన్సర్‌ను ఉపయోగించి, చివరగా వేడి తువ్వాలుతో ముఖాన్ని తుడుచుకోవడం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది.

ఐ జెల్స్ ఐ డ్రాప్స్: కళ్ల కింద వాపును తగ్గించి, కళ్లను ప్రకాశవంతంగా ఉంచడానికి ఐ జెల్స్, ఐ డ్రాప్స్ ఉపయోగిస్తారు.

క్లారిఫైయింగ్ సీరమ్: చర్మంలోని అదనపు నూనెను తొలగించి, రంధ్రాలను శుభ్రం చేయడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది.

గ్లో క్రీమ్: చర్మానికి మంచి మెరుపును ఇవ్వడంతో పాటు యాంటీ ఏజింగ్ ప్రయోజనాల కోసం నిక్ ఈ క్రీమ్‌ను వాడుతారు.

సన్‌స్క్రీన్: సూర్యుని హానికరమైన కిరణాల నుండి చర్మాన్ని కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ తప్పనిసరి అని ఆయన చిన్నప్పటి నుండే పాటిస్తున్నారు.

# రోజూ ఒక స్పూన్ ఈ మిశ్రమాన్ని తింటే చాలు... కీళ్ల నొప్పులు, షుగర్, అధిక బరువుకు చెక్!



మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా నేడు ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడుతూనే ఉన్నారు. అయితే, చిన్న చిన్న సమస్యలకు కూడా మందులు వాడకుండా.. మన వంటింట్లో ఉండే సహజసిద్ధమైన పదార్థాలతోనే ఎన్నో అనారోగ్యాలకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా అల్లం, తేనె కాంబినేషన్ మన శరీరానికి ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. ప్రతిరోజూ ఒక స్పూన్ అల్లం-తేనె మిశ్రమాన్ని తీసుకుంటే శరీరంలో జరిగే అద్భుతాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

తయారీ, వాడే విధానం:

ఒక చిన్న అల్లం ముక్కను తీసుకుని శుభ్రంగా కడిగి, పై తొక్క తీసి సన్నగా తురుముకోవాలి.

ఒక చిన్న గిన్నెలో ఒక స్పూన్ అల్లం తురుము, ఒక స్పూన్ స్వచ్ఛమైన తేనె వేసి బాగా కలుపుకోవాలి.


ఈ మిశ్రమాన్ని ప్రతిరోజూ ఉదయం పరగడుపున లేదా సాయంత్రం సమయంలో తీసుకోవాలి.

ఈ మిశ్రమంతో కలిగే అద్భుతమైన ప్రయోజనాలు:

1. కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం: వయసుతో సంబంధం లేకుండా చాలామందిని వేధిస్తున్న కీళ్ల నొప్పులకు అల్లం-తేనె మిశ్రమం దివ్యౌషధంలా పనిచేస్తుంది. అల్లంలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు నొప్పులు, వాపులను తగ్గిస్తాయి.
2. డయాబెటిస్ కంట్రోల్: షుగర్ వ్యాధితో బాధపడేవారికి ఇది ఒక మంచి ఇంటి చిట్కా. ప్రతిరోజూ దీన్ని తీసుకోవడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
3. వేగంగా బరువు తగ్గుతారు: అధిక బరువుతో బాధపడేవారు ఈ మిశ్రమాన్ని రోజూ వాడటం వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. మెటబాలిజం రేటు పెరిగి సులభంగా బరువు తగ్గుతారు.
4. జీర్ణ సమస్యలు మాయం: అజీర్ణం, గ్యాస్, కడుపుబ్బరం, మలబద్ధకం వంటి పొట్ట సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడేవారికి ఇది చాలా బాగా సహాయపడుతుంది. ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తుంది.



మెట్రో




# ఫిట్‌నెస్ కోసం భోజనం మానేస్తున్నారా? జాగ్రత్త..

ఈ రోజుల్లో త్వరగా బరువు తగ్గాలనే ఉద్దేశంతో చాలామంది అల్పాహారం మానేయడం, భోజనాన్ని ఆలస్యం చేయడం లేదా రోజంతా కేవలం టీ, కాఫీ లేదా జ్యూస్‌లపై ఆధారపడడం చేస్తున్నారు. కానీ ఇది ఆరోగ్యకరమైన పద్ధతి కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భోజనం మానేస్తే ఏమవుతుంది?

పగటిపూట తగినంత ఆహారం తీసుకోకపోతే సాయంత్రం సమయంలో ఎక్కువ ఆకలి వేస్తుంది. దీంతో రాత్రిపూట అధికంగా తినడం లేదా జంక్ ఫుడ్ తినే అవకాశం పెరుగుతుంది. ఇది జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే ఉపవాసం చేయడం లేదా భోజనం మానేయడం ఫిట్‌నెస్‌కు పరిష్కారం కాదని నిపుణులు చెబుతున్నారు.

బరువు తగ్గడానికి ఏమి చేయాలి?

భోజనం మానేయడం కంటే సమతుల్య ఆహారం తీసుకోవడం చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆహారంలో ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించి వ్యాయామ సామర్థ్యాన్ని పెంచుతాయి.

# లివర్ ఉబ్బితే శరీరంలో కనిపించే లక్షణాలు



ఈ రోజుల్లో చాలా మంది లివర్‌కి సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వాటిలో కాలేయ వాపు ఒకటి. ఈ పరిస్థితిని హెపటోమెగాలి (ఎవజూఫ్శీఎవస్త్రుశ్రీఎ) అంటారు. ఈ పరిస్థితిలో కాలేయం తన సాధారణ పరిమాణం కంటే పెద్దదిగా మారుతుంది. ఇది అంతర్లీన ఆరోగ్య సమస్యకు ఒక సంకేతం. అయితే, ఈ సమస్యను చాలా మంది గ్యాస్ ట్రబుల్ అనుకుంటారు.

కాలేయం మన శరీరంలో ఒక కీలకమైన అవయవం. ఇది ఎన్నో ముఖ్యమైన విధుల్ని నిర్వహిస్తుంది. మన శరీరంలోని హానికరమైన పదార్థాల్ని నిర్విషీకరణ చేయడం, జీర్ణవ్యవస్థ సజావుగా పనిచేసేలా చూడటం లివర్ ప్రాథమిక విధి. అయితే, ఈ రోజుల్లో జీవనశైలి, తిండి అలవాట్లు కారణంగా చాలా మంది కాలేయ వ్యాధులతో బాధపడుతున్నారు. ఫ్యాటీ లివర్‌తో చాలా మంది బాధపడుతున్న సంగతి తెలిసిందే.

అయితే, లివర్ వాపుని చాలా మంది గ్యాస్ ట్రబుల్‌గా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. కాలేయం వాపు అనేక రకాల సమస్యలకు దారితీస్తుంది. ఈ పరిస్థితిని హెపటోమెగాలి అంటారు. అసలు హెపటోమెగాలి అంటే ఏంటి, ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి డాక్టర్ రమాకాంత్ రెడ్డి ఎ (కన్సల్టెంట్ - మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, గ్లెనీగల్స్ అవేర్ హాస్పిటల్, ఎల్.బి. నగర్, హైదరాబాద్) పూర్తి వివరాలు అందించారు.

హెపటోమెగాలి అంటే కాలేయం తన సాధారణ పరిమాణం కంటే పెద్దదిగా మారడం లేదా వాపునకు గురికావడం. సాధారణంగా పెద్దవారిలో కాలేయం బయటకు తెలియదు. పొట్ట కుడివైపు పైభాగంలో (పక్కటెముకల కింద) చేత్తో నొక్కి చూసినప్పుడు కాలేయం పెద్దదైనట్లు అనిపిస్తే, డాక్టర్లు అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా దీన్ని నిర్ధారిస్తారు.

సాధారణ పరిమాణం ఎంత ఉండాలి?

మహిళల్లో: సుమారు 6 నుంచి 12 సెంటీమీటర్లు.

పురుషుల్లో: 15 సెంటీమీటర్ల వరకు (శరీర పరిమాణాన్ని బట్టి మారుతుంది).

ముఖ్య గమనిక: కాలేయం వాపు అనేది ఒక వ్యాధి కాదు, అది శరీరంలో ఏదో సమస్య ఉందనడానికి ఒక లక్షణం (ూఇస్త్రుఅ) మాత్రమే.

లక్షణాలు ఎలా ఉంటాయి?

చాలా మందిలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. కానీ కొందరిలో కింది మార్పులు రావచ్చు.

కుడివైపు పొట్ట పైభాగంలో బరువుగా లేదా నిండుగా ఉన్నట్లు అనిపించడం.

పొట్టలో అసౌకర్యం, కొద్దిగా తినగానే కడుపు నిండిపోయినట్లు అనిపించడం

తీవ్రమైన అలసట, నీరసం.

మెట్రో ఈవినింగ్స్ సినిమా



# చిన్నసామి నుండి పద్మశ్రీ భారతీరాజా వరకు.. 6 జాతీయ అవార్డులు, నంది పురస్కారాలు!



భారతీయ చిత్రసీమలో కొందరు దర్శకులు కేవలం సినిమాలు మాత్రమే తీయరు, ఒక కొత్త శకాన్నే సృష్టిస్తారు. అలాంటి అరుదైన సృష్టికర్తలలో తమిళ దర్శకుడు భారతీరాజా ఒకరు. అప్పటివరకు నాలుగు గోడల మధ్య, రంగురంగుల స్టూడియో సెట్లలోనే సాగుతున్న సినిమాను పల్లెటూరి పచ్చని పొలాల వైపు, మట్టి వాసన వైపు నడిపించిన విప్లవకారుడు ఆయన. ఒక చిన్న గ్రామం 'అల్లినగరం'లో పుట్టిన చిన్నసామి అనే సామాన్య యువకుడు, ఆ తర్వాత 'భారతీరాజా'గా మారి దేశం గర్వించదగ్గ దర్శకుడిగా ఎదగడం వెనుక ఎన్నో ఏళ్ల నిరంతర శ్రమ, అవమానాలు, ఓటములు ఉన్నాయి. సినిమాపై ఉన్న పిచ్చితో చెన్నై చేరిన ఆయన.. పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ, నాటకాల్లో నటిస్తూ అవకాశాల కోసం తిరిగారు. పి. పుల్లయ్య, పుట్టణ్ణ కణగల్ వంటి దిగ్గజాల దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమా మెళకువలను నేర్చుకున్నారు.



# బాలకృష్ణకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్, బ్రాహ్మణి





నటసింహం, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేకమైన రోజున ఆయనకు కుటుంబ సభ్యులు, సినీ రాజకీయ ప్రముఖులు, మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఆయన అల్లుడు, మంత్రి నారా లోకేశ్ అలాగే కుమార్తె నారా బ్రాహ్మణి తమ ప్రియతమ తండ్రికి, మావయ్యకు ప్రేమపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పెట్టిన పోస్ట్‌లు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి।ాశీశ్రీఱఅఎం

"నిండైన తెలుగుదనం, అభిమానం, భోళాతనానికి ప్రతిరూపం మా బాలా మావయ్యకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ నారా లోకేశ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బాలకృష్ణను అభిమానుల పాలిట 'గాడ్ ఆఫ్ మాసెస్' అని, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎంతోమంది క్యాన్సర్ బాధితులకు అండగా నిలిచే 'ఆపన్న హస్తం' అని ఆయన కొనియాడారు. హిందూపురం ప్రజా విజేత అయిన బాలకృష్ణ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో వందేళ్లు వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు.

నాన్నే నా సూపర్ హీరో: నారా బ్రాహ్మణి

మరోవైపు బాలకృష్ణ కుమార్తె నారా బ్రాహ్మణి తన తండ్రిని రియల్ సూపర్ హీరోగా అభివర్ణిస్తూ ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు నా!న్న చిన్నప్పుడు నేను సూపర్ హీరో కోసం ఎక్కడో వెతకలేదు, మిమ్మల్ని చూస్తే చాలు అనిపించేది. మీకున్న అభిరుచి, పట్టుదలే నన్ను ఈ రోజు ఈ స్థాయిలో తీర్చిదిద్దాయి. నాకు ప్రతి విషయంలో అండగా, గురువుగా, గొప్ప స్ఫూర్తిగా నిలిచినందుకు ధన్యవాదాలు. మీ కుమార్తెగా పుట్టడం నా పూర్వజన్మ సుకృతం, నా అదృష్టం" అని బ్రాహ్మణి తన పోస్టులో ఎంతో ప్రేమగా రాసుకొచ్చారు. రాబోయే ఏడాది మొత్తం ఆయన మంచి ఆరోగ్యం, సంతోషంతో గడపాలని ఆమె ఆకాంక్షించారు.

# ఫిఫా వరల్డ్ కప్ 2026




జూన్ 11వ తేదీన మెక్సికో సిటీలో మెక్సికో, సౌత్ ఆఫ్రికా మధ్య జరిగే ఓపెనింగ్ మ్యాచ్‌తో అధికారికంగా ప్రారంభం కానుంది. అర్జెంటీనా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ సహా మొత్తం 48 జట్లు ఈ మెగా టోర్నీలో తలపడుతున్నాయి.

జూన్ 11, 2026న ప్రపంచంలోనే అతిపెద్ద ఫుట్‌బాల్ పండుగ ఫిఫా వరల్డ్ కప్ 2026 అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో గ్రూప్‌లో భాగంగా మొదటి రోజు రెండు ఉత్తేజకరమైన మ్యాచ్‌లు జరగనున్నాయి.

## గోల్డ్ మెడల్ కోసం.. విరాట్తో సూర్యవంశీ ని బరిలోకి దింపాలి: శ్రీ శాంత్



ఇంటర్నెట్ డెస్క్: దాదాపు వందేళ్ల అనంతరం ఒలింపిక్స్లో క్రికెట్ను చూడబోతున్నాం. లాస్ ఏంజెలెస్ వేదికగా 2028లో ఒలింపిక్స్ జరగబోతున్నాయి. టీమ్ ఇండియా స్వర్ణ పతకం నెగ్గాలనేదే అభిమానుల ఆకాంక్ష. టీ20 ఫార్మాట్లో ఈ మ్యాచులు జరుగుతాయి. విరాట్ కోహ్లితో కలిసి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఓపెనర్ గా పంపించాలని మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సూచించాడు. అయితే, విరాట్ కోహ్లి టీ20లకు వీడ్కోలు చెప్పిన సంగతి తెలిసిందే. కానీ, ఒలింపిక్స్ లో ఆడాలని ఉందని గతంలో విరాట్ తన మనసులోని మాట వెల్లడించాడు. ఇప్పుడు వైభవ్ దూకుడుకు విరాట్ సీనియారిటీ కలిస్తే బాగుంటుందనేది శ్రీశాంత్ అభిప్రాయం. వైభవ్ సూర్యవంశీ ఆటను చూస్తుంటే ముచ్చటేస్తోంది. అద్భుతంగా ఆడేస్తున్నాడు. రాబోయే ఒలింపిక్స్ లో మనం గోల్డ్ పతకం కొట్టాలంటే బెస్ట్ టీమ్ను పంపించాలి. విరాట్ కోహ్లి జట్టులో ఆడాలని విజ్ఞప్తి చేస్తున్నా. అప్పుడు వైభవ్ సూర్యవంశీతో కలిసి విరాట్ ఓపెనింగ్ చేయొచ్చు. సీనియర్, జూనియర్తో జట్టు సమతూకంగా ఉంటుంది. ఈ జోడీని చూసేందుకూ బాగుంటుంది. ముందుగా విరాట్ కోహ్లిని టీ20 జట్టులో ఆడమని సెలక్టర్లు కోరాలి. అతడి ఫిట్నెస్ ను చూస్తే వయసు సమస్యే కాదు. నేను చెప్పే మాటలు వివాదానికి దారితీసినా ఫర్వాలేదు. ఎలాగైనా సరే విరాట్ను ఒప్పించాలి. ఒలింపిక్స్ లో ఆడేలా చూడాలిః అని శ్రీశాంత్ తెలిపాడు.

కేవలం 15 ఏళ్ల వయసులోనే టీమ్ ఇండియాకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీ.. తుది జట్టులో ఆడితే మాత్రం చరిత్ర సృష్టించినవాడవుతాడు.

# మెట్రో స్పోర్ట్స్

## టోర్నీ ప్రారంభానికి ముందే 2 లక్షల టికెట్లు



ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్‌కప్ మహా సంగ్రామం మొదలైంది. జూన్ 12 నుంచి ప్రారంభమవ్వనున్న ఈ టోర్నీకి ముందు కెప్టెన్ల ఫొటో షూట్ నిర్వహించారు. టోర్నీ ప్రారంభానికి ముందే 2 లక్షల టికెట్లు అమ్ముడవడంతో మెగా ఈవెంట్‌పై ఎన్ని అంచనాలు ఉన్నాయో చెప్పింది. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు టోర్నీ జరగనుంది. భారత్ తన తొలి మ్యాచ్‌ను దాయాది పాకిస్థాన్‌తో జూన్ 14న బర్మింగ్‌హామ్ వేదికగా ఆడనుంది.

మహిళల క్రికెట్‌పై ఐసీసీ ప్రత్యేక దృష్టిసారించినప్పటి నుంచి ప్రజల్లో కూడా ఆసక్తి పెరిగింది. జూన్ 12 నుంచి మొదలయ్యే ఐసీసీ ఉమెన్స్ టీ 20 వరల్డ్‌కప్ 2026 ప్రారంభానికి ముందే సుమారు 2 లక్షలు టికెట్లు అమ్ముడయ్యాయి. ఉమెన్స్ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు ఇదే రికార్డు బుకింగ్. గతంలో ఏ టీ20 వరల్డ్‌కప్‌లో కూడా ఇలాంటి సేల్స్ నమోదవ్వలేదు. టోర్నీ ప్రారంభానికి ముందే ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్‌కప్‌పై అభిమానులు ఉత్సాహంగా ఉన్నారు అని చెప్పడానికి ఈ టికెట్ల విక్రయమే నిదర్శనం. టోర్నీ ప్రారంభానికి ఇంకో ఐదు రోజులు ఉండగా ఐసీసీ టీ20 కెప్టెన్లతో ఫొటోషూట్ నిర్వహించింది. టోర్నీలో పాల్గొనే 12 దేశాల క్రికెట జట్ల కెప్టెన్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఐసీసీ టీ 20 వరల్డ్ కప్ 2026 ట్రోఫీతో ఫొటోలు దిగారు. ఈ టోర్నీ ఇంగ్లండ్ వేదికగా జరగనుండటం కూడా అభిమానులను ఆకట్టుకోవడానికి ఒక కారణం. లండన్‌లో జరిగిన కెప్టెన్ల మీట్‌కు అభిమానులు ఎక్కువ మంది రావడంపై ఐసీసీ డైరెక్టర్, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్ రిచర్డ్ థామ్సన్ ఆనందం వ్యక్తం చేశాడు. మహిళల క్రికెట్ భవిష్యత్తులో ఎలా ముందుకు సాగుతుందో చెప్పడానికి ఇదే నిదర్శనమని ఆయన కొనియాడారు.

మహిళల టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్ ఇంగ్లండ్ వేదికగా ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్‌కప్ 2026 ప్రారంభం కానుంది. జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. మొత్తం 12 జట్లు పాల్గొనే ఈ టోర్నీపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఐసీసీ ఉమెన్స్ వరల్డ్‌కప్ సొంతం చేసుకున్న భారత్.. టీ20 వరల్డ్‌కప్ కూడా కైవసం చేసుకోవాలని చూస్తోంది. తొలి మ్యాచ్ జూన్ 12న ఇంగ్లండ్ – శ్రీలంక దేశాల మధ్య జరగనుంది. మొత్తం 33 మ్యాచ్‌లు జరిగే ఈ టోర్నీలో జూలై తొలి వారంలో సెమీ ఫైనల్స్, జూలై 5న లార్డ్స్‌లో ఫైనల్స్ నిర్వహించనున్నారు. మొత్తం రెండు గ్రూప్‌లు విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. గ్రూప్ 1లో భారత్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ నెదర్లాండ్స్. గ్రూప్ 2లో ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, శ్రీలంక, ఐర్లాండ్, స్కాట్లాండ్ జట్లు ఉన్నాయి.

టీమిండియా మ్యాచ్‌లు ఈ టోర్నీలో అత్యంత ఆసక్తికర మ్యాచ్ అయిన భారత్ – పాకిస్థాన్ మ్యాచ్ కోసం ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. టోర్నీలో తన తొలి మ్యాచ్‌లో భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జూన్ 14న బర్మింగ్‌హామ్ వేదికగా తలపడనుంది. జూన్ 17న నెదర్లాండ్స్‌తో, జూన్ 21న సౌతాఫ్రికా, జూన్ 25న బంగ్లాదేశ్, జూన్ 28న ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007